



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 100 | ది. 19-7-2026 | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 100 | Date : 19-7-2026 | Sunday | Pages : 8 | Rs.1/- |


## డిప్యూటీ సీఎం ని పరామర్శించిన మంత్రి నారా లోకేష్



హైదరాబాద్, జూలై 18 (వార్తాప్రభ) : కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. హైదరాబాద్ లోని పవన్ కళ్యాణ్ నివాసానికి శనివారం సాయంత్రం వెళ్లిన లోకేష్ విజయవాడ కనకదుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం అందించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భుజానికి అయిన గాయం, శస్త్ర చికిత్స గురించి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు పాటించాలని కోరారు.

# కాలుష్య రహిత రాష్ట్రంగా ఏపీ

- మీ ఊరిని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత మీదే
- ప్రజా ప్రభుత్వానికి పేదల పక్షాన ఆలోచించే మనసు ఉంది
- 2024లో రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారు
- బూతులు తిట్టిన వారి నోళ్లను ఓట్లతో కడిగారు
- భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో అసభ్య పోస్టులు సహించేది లేదు
- రూ.15,274 కోట్లతో పట్టణాభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం

## గుడివాడ స్వచ్ఛాంధ్ర-- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు









**గుడివాడ,జూలై 18 (వార్తాప్రభ) :** స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రతో పరిశుభ్రమైన, సంపన్నమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయుడు అన్నారు. ఇంటి నుంచే చెత్త రాకుండా నెట్ జీరో విధానాన్ని అలవాటు చేసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. కార్బన్ న్యూట్రల్ జీవన విధానం అవలంబించాలని, ఇంటిపై పడే వర్షపు నీటిని భూగర్భజలాలుగా మార్చుకునే చర్యలు తీసుకోవాలని సూచించారు. కృష్ణాజిల్లా గుడివాడలో నిర్వహించిన 18వ స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 120 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో రూ.15,274 కోట్ల విలువైన ప్రజారోగ్య, మున్సిపల్ ఇంజినీరింగ్ పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ప్రజా వేదిక సమీపంలో ఆన్‌లైన్ వర్క్స్ మానిటరింగ్ సిస్టమ్‌ను పరిశీలించారు. మెప్మా మహిళా సంఘాలు తయారు చేసి ప్రదర్శించిన ఉత్పత్తులను తిలకించారు. నెల్లూరు, కొండపల్లి, బేతంచర్ల, కమలాపురం, బద్వేల్, ఏలేశ్వరం, నర్సీపట్నం, పెద్దాపురంలో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు ప్రారంభించారు. ఉయ్యూరు, కుప్పం, నిడుదవోలు, బాపిరాజు, మదనపల్లి, విజయనగరం, మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్, గ్రేటర్ విశాఖ, నెల్లూరు కార్పొరేషన్లకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ అవార్డులు అందించిన సీఎం...ఆపరేషన్ క్లీన్ స్వీప్‌పై కాఫీ టేబుల్ బుక్‌ను ఆవిష్కరించారు.

**స్వచ్ఛ రాజకీయ లక్ష్యంతో ఎన్టీఆర్ పార్టీ స్థాపన..** రాష్ట్రంలో ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నానని, ఈసారి 18వ కార్యక్రమాన్ని గుడివాడలో నిర్వహిస్తున్నామని తెలిపారు. గుడివాడ దివంగత ఎన్టీఆర్ తొలిసారి ప్రజాక్షేత్రంలో నిలబడిన ప్రాంతమని గుర్తు చేశారు. స్వచ్ఛమైన రాజకీయాలు, స్వచ్ఛమైన ప్రజాప్రతినిధులు, స్వాభిమానం అనే లక్ష్యాలతో ఎన్టీఆర్ పార్టీని స్థాపించారని చెప్పారు. గతంలో స్వార్థ రాజకీయాలే ఉన్న పరిస్థితిని మార్చి అభివృద్ధి, సంక్షేమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగాల కల్పన, సంపద సృష్టే లక్ష్యంగా పాలన అందిస్తోందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా శాంతిభద్రతలు, సంక్షేమం, ఆదాయ వృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు.

**పరిశుభ్రమంటే ప్రజారోగ్యం మెరుగుపడటం..** 'పరిశుభ్రత అంటే కేవలం రోడ్లు ఊడ్చడం మాత్రమే కాదని, పర్యావరణం, ప్రజారోగ్యం మెరుగు పడటమే అసలు లక్ష్యం. గత పాలనలో చెత్తతో నిండిపోయిన ప్రాంతాలను ఇప్పుడు పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నాం. ప్రతి ఒక్కరూ తమ జన్మస్థలాన్ని చెత్త రహితంగా ఉంచే బాధ్యత తీసుకోవాలని పిలుపు నిస్తున్నా. ప్రభుత్వానికి ప్రజలు సహకరిస్తేనే స్వచ్ఛత లక్ష్యం సాధ్యం. పచ్చదనం, పరిశుభ్రతతోనే స్వర్ణాంధ్ర నిర్మాణం పూర్తి అవుతంది. తెలుగు జాతి భవిష్యత్తును రక్షించే బాధ్యత తాను తీసుకున్నానని, పూర్తి పారదర్శకంగా సుపరిపాలన అందిస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతిని సహించబోం. ప్రజా రాజధాని అమరావతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. గతంలో జన్మభూమి కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారు స్పందించిన స్ఫూర్తి కొనసాగాలని ఆకాంక్షిస్తున్నా. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, చెరువుల పునరుద్ధరణ, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి ద్వారా సురక్షితమైన తాగునీరు, మెరుగైన పారిశుధ్య వ్యవస్థను తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం' అని సీఎం అన్నారు.

**అక్టోబర్ 2 నాటికి చెత్త రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దతాం..** ఇంటింటికీ చెత్త సేకరణ కోసం 126 ఎలక్ట్రిక్ ఆటోలను ప్రారంభించామని, త్వరలో మరో 1104 ఇ-ఆటోలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రూ.528 కోట్లతో వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నామని, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి కోసం రాష్ట్రంలో 8 ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతి ఇంట్లో వ్యర్థాల వర్గీకరణ ప్రారంభించాలని ప్రజలను కోరిన సీఎం, స్వచ్ఛ రథం ద్వారా వ్యర్థాల సేకరణ చేస్తూ రూ.16 కోట్ల విలువైన నిత్యావసర సరుకులు అందించామని తెలిపారు. గత పాలకులు రోడ్లపై పేరుకుపోయేలా వదిలేసిన చెత్త కారణంగా భూగర్భజలాలు కలుషితమయ్యాయని, వారు వదిలేసిన 140 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించామని చెప్పారు. అక్టోబర్ 2 నాటికి రాష్ట్రాన్ని చెత్త రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ పథం, ఆపరేషన్ క్లీన్ స్వీప్ వంటి కార్యక్రమాలు చేపట్టామని వెల్లడించారు.

## గోదావరి నదిలో మునిగి ఐదుగురు జాలర్లు మృతి

**హైదరాబాద్,జూలై 18 (వార్తాప్రభ) :** తెలంగాణ ఆంధ్ర సరిహద్దుల్లో శని వారం విషాద ఘటన చోటు చేసుకుంది, చేపల వేటకు వెళ్ళిన ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు గోదావరి నదిలో గల్లంతయ్యారు. వీరిలో ఇద్దరి మృత దేహాలను వెలికి తీయగా.. గల్లంతయి న వారి కోసం గాలిం పు చర్యలు చేపడు తున్నారు. పోలవరం జిల్లా ఎటపాక మండలం గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన 11 మంది జాలరులు గొల్లగూడెం వద్ద గల గోదావరి వద్దకు చేపల వేటకు వెళ్లా రు. నదిలో దిగిన వారికి లోతు తెలి యక బసిబోయిన బాలరాజు(38), ఊయిక రమేష్(38), తుర్రం భారతి (40), ఊయిక లక్ష్మి (37),ఊయిక సుశీల (37) లు గోదావరిలో గల్లంతయ్యారు. సమాచారం అందు కున్న స్థానికులు, పోలీస్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన ఐదుగురు కోసం గాలించగా రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. గొమ్ముకొత్తగూడానికి చెందిన ఐదుగురు మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుము కున్నాయి.

## ఏపీలో రానున్న 5 రోజులు వర్షాలు.. పలు జిల్లాలకు హెచ్చరిక



**విజయవాడ,జూలై 18 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్‌లో రానున్న ఐదు రోజుల పాటు వాతావరణం మేఘా వృతమై ఉంటుందని, పలుచోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. కోస్తాంధ్ర తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఆదివారం (జులై 19) పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన వివరించారు. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, పోలవరం, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, కడప జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడతాయని పేర్కొన్నారు. మిగిలిన జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని తెలిపారు.






# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం..

- భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరాన్ని అందించవలసిన బాధ్యత మనందరిపై ఉంది.
- పరిసరాలు పరిశుభ్రతలో ప్రతి ఒక్కరికి దినచర్యల్లో ఒక భాగం కావాలి.
- స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చీపురు ని చేతబట్టి పాఠశాల ప్రాంగణాన్ని తుడిచి శుభ్రంచేసిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ...






**నూజివీడు,జూలై 18 (వార్తాప్రభ) :** ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం గ్రామంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రతి మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా "బల్క్ వేస్ట్ జనరేటర్స్ నమోదు, ఘనవ్యర్థాలు నిర్వహణ నియమాలు మరియు పరిశుభ్రత పట్ల అవగాహన" అనే థీమ్ తో కార్యక్రమాన్ని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చీపుర్లను చేతబట్టి, విద్యార్థిని, విద్యార్థులు గ్రామస్తులతో కలిసి పాఠశాల ప్రాంగణాన్ని తుడిచి శుభ్రం చేశారు. పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు పరిసరాలు పరిశుభ్రత, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చేతులను దగ్గర ఉండి శుభ్రం చేయించారు. విద్యార్థులతో మంత్రి కాసేపు ముచ్చటించారు. మొక్కలను నాటి, అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర - 2047 సంకల్పంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎన్జీఓలు, కార్పొరేటు సంస్థలు, విద్యార్థులు, యువత, సేవా సంస్థలు, స్వచ్ఛందంగా పాల్గొనాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు అందరూ పాల్గొని, మంచి ఫలితాలు వస్తున్నాయని అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏదో జిల్లాలో పాల్గొని, అందరికీ స్ఫూర్తిని నిశీపుతున్నారని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే, వ్యాధులు సోకుతాయని, ప్రజలు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ఆర్థికంగా బలహీనులు అవుతారని అన్నారు. వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారని అన్నారు. "స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర" కార్యక్రమం కేవలం పరిశుభ్రత కార్యక్రమం మాత్రమే కాదని, ఇది ప్రతి పౌరుడు బాధ్యతగా పాల్గొని రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా, అభివృద్ధి దిశగా నడిపించే ప్రజా ఉద్యమం అన్నారు. పరిశుభ్రమైన గ్రామాలు, పట్టణాలు మన ఆరోగ్యానికి, పర్యావరణానికి, భావి తరాలకు అమూల్యమైన సంపద అన్నారు. మన పరిసరాలను శుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరీ బాధ్యత అని, మనఇల్లు, మనవీధి, కార్యాలయం, పాఠశాల, ఎక్కడైనా పరిశుభ్రతను పాటించడం ద్వారా మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దగలమని అన్నారు. ప్రజలు సహకారంతో చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేయడం, ప్లాస్టిక్, క్యారీ బ్యాగులను వినియోగాన్ని తగ్గించడం, పచ్చదనాన్ని పెంపొందించడం, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను విజయవంతంగా చేస్తే, మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు భాగస్వామ్యం తోడైతేనే ఈ లక్ష్యం సాకారం తప్పక అవుతుందని అన్నారు. మనమంతా కలిసి పనిచేస్తేనే పరిశుభ్రమైన, సుస్థిరమైన, అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించగలమని అన్నారు. ప్రతి పౌరుడు ఈ ఉద్యమంలో భాగస్వామి కావాలని, పరిశుభ్రతను మన జీవన విధానంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, వివిధ శాఖలు అధికారులు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# హెచ్.ముత్యాలంపాడు ఎస్సీ కాలనీలో త్రాగునీరు కలుషితాన్ని అరికట్టారు

- మంచినీటి పైప్ లైన్ కు మరమ్మత్తులు
- "వార్తాప్రభ" కథనానికి స్పందన








హెచ్.ముత్యాలంపాడు ఎస్సీ కాలనీలో
త్రాగునీరు కలుషితం....!



**జి.కొండూరు(హెచ్.ముత్యాలంపాడు),జూలై 18 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం, హహేలి ముత్యాలంపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో త్రాగునీరు కలుషితం కాకుండా మంచినీటి పైపులైన్లు, కుళాయిలకు గ్రామ పంచాయితీ కార్యదర్శి ఎస్.తిరుపతిరావు ఆధ్వర్యంలో మరమ్మత్తు పనులు చేపట్టారు. ఈ నెల 16వ తేదీ గురువారం వార్తాప్రభ దినపత్రికలో ప్రచురించిన "హెచ్.ముత్యాలంపాడు ఎస్సీ కాలనీలో త్రాగునీరు కలుషితం "కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. తక్షణమే మంచినీటి పైపు లైన్ లకు ఏర్పడిన లీకేజి లను అరికట్టే పనులు ముమ్మరం చేశారు. గ్రామంలోని చిలపరపు జక్రయ్య ఇంటి వద్ద,ప్రతిపాటి అబ్రహం ఇంటి వద్ద, పచ్చిగోళ్ళ పున్నమ్మ ఇంటి వద్ద మంచినీటి పైపు కు ఏర్పడిన లీకేజ్ లను, అలాగే మంగళగిరి లోపిని(తిరుమలశెట్టి లక్ష్మి) ఇంటి వద్ద మంచినీటి పైపు లైన్ కి ఏర్పడిన 2 లీకేజీలకు మరమ్మత్తులు చేస్తున్నారు. దీనిపై సెక్రటరీ తిరుపతిరావు స్పందిస్తూ ప్రస్తుతం ఉన్న ఏసీ పైప్‌లైన్‌లు పాతవనీ అలాగే సిమెంట్ -కాంక్రీట్ రోడ్లు, గోడల కింద భూమి మట్టానికి 2.50 మీటర్ల లోతులో ఉన్నాయని తెలిపారు. పై పనుల కోసం పని అంచనాను కోరుతూ ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ కు పంచాయతీ తీర్మానాన్ని సమర్పించడం జరిగిందని, అంచనా అందిన తర్వాత మరమ్మత్తు పనులను ప్రారంభించామన్నారు. ప్రస్తుతం రెండు లీకేజీలను సరిచేశామని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయి, రాబోయే రెండు రోజుల్లో పూర్తి చేస్తామని సెక్రటరీ తెలియజేశారు.



## జగన్ 2.0 సూపర్ యాప్ ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే డా: జగన్మోహనరావు



**నందిగామ,జూలై 18 (వార్తాప్రభ) :** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహనరెడ్డి ఆదేశాలమేరకు నందిగామ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పార్టీ నాయకులతో కలిసి జగనన్న 2.0 యాప్ ను శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్ ను పార్టీ లో ప్రతి నాయకులు కార్యకర్తలు ఇన్స్టాల్ చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ పార్టీ శ్రేణులకు దిక్సూచి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో నియోజకవర్గ నాలుగు మండలం , పట్టణ అధ్యక్షులు వివిధ హోదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం... ఆరోగ్యంగా ఉందాం!!! - ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

**విజయవాడ (కృష్ణలంక),జూలై 18 (వార్తాప్రభ) :** మన ఇంటి తో పాటుగా గృహ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా ఉందామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ప్రజలకు సూచించారు.శనివారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్ కరెన్సీ నగర్ ఆంజనేయ స్వామి గుడి ఏరియాలో,'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ మోహన్ మాట్లాడుతూ పరిశుభ్రత అనేది ప్రభుత్వ కార్యక్రమమే కాకుండా ప్రజలు కూడా శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరరూ తమ ఇల్లు శుభ్రంగా ఉంచేందుకు చూస్తున్నారే కానీ తమ ఇంటి పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆలోచన రాకపోవడం సోచనీయమన్నారు. ఇంటి పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యం సొంతం అవుతుందని చెప్పారు. ఇంటి పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రతినెలా మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు వ్యాప్తి చెంది ఇంటిలోకి వస్తాయని చెప్పారు. తడి, పొడి చెత్తను వేరుగా చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. ప్లాస్టిక్ వల్ల అనేక రకాల సమస్యలు వస్తున్నాయని అందువల్ల ప్లాస్టిక్



వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని చెప్పారు. వేడి ఆహార పదార్థాలను ప్లాస్టిక్ సంచుల్లో ప్యాకింగ్ చేయడం వల్ల ప్లాస్టిక్ కరిగి ఆహారం లోకి చేరి, తద్వారా మన శరీరంలోకి ప్రవేశించి క్యాన్సర్లకు కారణం అవుతున్నాయని వివరించారు. వ్యవసాయ రంగంలో కూడా క్రిమిసంహారక మందులను అధికంగా వినియోగించడం వల్ల వల్ల అనేక రకాల వ్యాధులు వస్తున్నాయని, గతంలో ఇంటిలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాల్ని వ్యవసాయ రంగంలో క్రిమిసంహారక మందులుగా ఉపయోగించే వారని చెప్పారు. అందువల్ల సాధ్యమైనంతవరకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్య వంతులుగా కావాలని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధానాలపై ఇలాంటి సమావేశాల్లో అధికారులు వారికి తెలియజేస్తారని, అందువల్ల ప్రజలు కూడా ఇలాంటి సమావేశాలకు వచ్చి అవగాహన పెంచుకోవాలని ఆయన కోరారు.కార్పొరేషన్ జోనల్ కమిషనర్ షమీ మాట్లాడుతూ బల్క్ వేస్ట్ మేనేజ్మెంట్ సిస్టమ్ అనే కొత్త వ్యవస్థను అమలు చేస్తున్నామని, ఈ వ్యవస్థ ద్వారా వ్యాపార సంస్థలు, పాఠశాలలు తమ దగ్గర ఉత్పత్తి అయ్యే చెత్తను వారే రీసైక్లింగ్ చేయాలని లేని పక్షంలో కార్పొరేషన్ కు ఫీజు చెల్లించి అనుమతి పొందాలన్నారు. ప్రస్తుతం ఇళ్ల దగ్గర నుంచి సేకరిస్తున్న తడి-పొడి చెత్త, హానికర వ్యర్థాలతో పాటుగా నూతనంగా ఇ-వ్యర్థాలను (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు) కూడా బ్లాక్ కలర్ ప్లాస్టిక్ డబ్బాల్లో ఉంచి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. ప్రజలు ఈ విధంగా చేయడం వల్ల పారిశుధ్య సిబ్బందికి వ్యర్థాలను అందజేసి నగరాన్ని శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గద్దె రమేష్, తాడి బాబూరావు, మ-ఙ్మనేని ప్రసాద్, యలమంచిలి యలమందరావు, కొల్లపల్లి నారాయణరావు, మురళీ కృష్ణ, బండి సాయి కోమలి, గుళ్లపల్లి శంకర్, రాగాని సాయి, గుంజి ఏసుబాబు, గల్లా రవి.కార్పొరేషన్ ఇ.ఇ. రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ పంట కాలవ



**విస్సన్నపేట,జూలై 18 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో శ్రీ కావలి శంకరా రావు జిల్లా పరిషత్ హై స్కూల్ ఏరియానుండి వేస్ట్ వాటర్ గతంలో లలితా సూపర్ మార్కెట్ పెట్రోల్ బంక్ శ్రీరామ్ థియేటర్ వద్ద నుండి చింతకుంట పంట కాలువ లో కలిసి పంట భూములు వైపు వెళ్ళేవి. మారుతున్న కాలానికి అనుగుణంగా చింతకుంట చెరువు ఆయకట్టు వ్యవసాయం లేకపోవడం రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోవడంతో పంట కాలువ కూడా తధానగుణంగా పూడి పోవటం జరిగింది. వర్షాలు పడితే డ్రైనేజీలలోనుండి నీరు వెళ్లకుండా రోడ్లపై నిలవడం మొదలైంది. హై స్కూల్ ఏరియా వాటర్ ఎటువైపు వెళ్ళాలి అనే విషయంపై అధికారులు తేల్చవలసిన పరిస్థితి ఉన్నదని హైస్కూల్ పరిసర ప్రాంతాలలో డ్రైనేజీ నీరు నిలవకుండా విద్యార్థినీ విద్యార్థులు ఆరోగ్యానికి దృష్టిలో ఉంచుకొని దిశా నిర్దేశం చేయవలసిందిగా పరిసర ప్రాంత వాసులు కోరుతున్నారు.

# విద్యాభివృద్ధికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి: పైడి సుధాకర్

● దయాల షడ్రక్ మెమోరియల్ స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ

**హనుమాన్ జంక్షన్,జూలై 18 (వార్తాప్రభ) :** విద్యావ్యాప్తి, విద్యాభివృద్ధికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు మరింతగా ముందుకు రావాలని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు పైడి సుధాకర్ పిలుపునిచ్చారు. బాపులపాడు మండల కేంద్రం హనుమాన్ జంక్షన్‌లోని దయాల షడ్రక్ మెమోరియల్ స్కూల్లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పైడి సుధాకర్ తన మిత్రబృందంతో కలిసి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, ఇతర స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు. అలాగే పాఠశాల అవసరాలకు కావలసిన స్టేషనరీని కూడా అందజేశారు. ఈ సందర్భంగా పైడి సుధాకర్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ, సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా విద్యార్థులకు తోడ్పాటు అందించాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు చేయూతనిచ్చే ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోయపాటి ప్రసాద్, గొట్టాపు వాసుదేవరావు, చింతా జగ్గారావు,



గార్లపాటి రాజేశ్వరరావు, తాడి రంగారావు, వంకదారు శరణ్, వెత్సా వెంకటేశ్వరరావు, గార్లపాటి కాళీ వరప్రసాద్, పాబోలు కిషోర్, గార్లపాటి సునీల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూరపాటి సుజ్ఞానం, ఉపాధ్యాయుడు ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## తిరువూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీ చేపట్టిన ఆర్డీవో ఏ.కుమార్



**తిరువూరు,జూలై 18 (వార్తాప్రభ) :** మరుగుదొడ్ల దుస్థితిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినఆర్డీవోబస్టాండ్‌లో నిర్వహణ లోపాలపై అధికారులను నిలదీసిన వైనం.మున్సిపల్ కమిషనర్ కే మనోజ, తహసిల్దార్ డి చంద్రమౌళి, ఆర్టీసీ డిఎం ఏ సుబ్రహ్మణ్యం, అధికారులతో కలిసి పరిశీలన..మరుగుదొడ్ల ప్రదేశంలో హోటల్ నిర్వహించడంపై తీవ్రంగా ఆగ్రహించిన ఆర్డీవో..పాత మరుగుదొడ్లు తొలగించి ఆధునిక సదుపాయాలు కల్పించాలని ఆదేశం.నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన ఆర్డీవో..బస్టాండ్ పరిసరాల్లో పారిశుద్ధ్యంపైనా ప్రత్యేక దృష్టి సారించిన ఆర్డీవో.. త్వరలో మెరుగైన సదుపాయాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు, స్థానిక ప్రజలు..

# ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంలో ముందంజలో ఆర్డీవో ఏ. కుమార్

**తిరువూరు,జూలై 18 (వార్తాప్రభ) :** ప్రభుత్వ అధికారిగా ప్రజలకు చేరువ కావాలంటే బాధ్యతతో పాటు సేవాభావం కూడా అవసరమని తన పనితీరుతో నిరూపిస్తున్నారు ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో) ఏ. కుమార్. గతంలో పనిచేసిన ఆర్డీవోలతో పోలిస్తే ప్రజలకు మరింత అందుబాటులో ఉంటూ, ప్రతి ఫిర్యాదును సానుకూలంగా స్వీకరించి వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్న అధికారిగా ఆయన గుర్తింపు పొందుతున్నారు. ప్రతిరోజూకార్యాలయానికి వచ్చే ప్రజలను స్వయంగా కలుసుకుని వారి సమస్యలను ఓపికగా వింటూ, సంబంధిత శాఖల అధికారులతో వెంటనే సమన్వయం చేసి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. భూ వివాదాలు, రెవెన్యూ సమస్యలు, వారసత్వం, పట్టాదారు పాస్‌బుక్‌లు, ప్రభుత్వ భూముల అంశాలు,



సంక్షేమ పథకాల అమలు వంటి అనేక సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కార్యాలయంలో ప్రజలు ఎక్కువసేపు నిరీక్షించాల్సిన పరిస్థితి లేకుండా ఫిర్యాదులను నమోదు చేసి, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం ఆయన పనితీరులో ప్రత్యేకతగా నిలుస్తోంది. పెండింగ్‌లో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు.కేవలం కార్యాలయానికే పరిమితం కాకుండా, గ్రామాలు మరియు పట్టణ ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక పరిస్థితులను పరిశీలించడం, ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకోవడం, అవసరమైన చోట అక్కడికక్కడే అధికారులకు సూచనలు ఇవ్వడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నారు. ప్రభుత్వ సేవలు అర్హులందరికీ సకాలంలో అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

## బీబి సకీనా వర్ధంతికి ఏర్పాట్లు పూర్తి




**అమలాపురం,జూలై 18 (వార్తాప్రభ) :** ఇమామ్ హుస్సేన్ కుమార్తె బీబి సకినా వర్ధంతి సభలు స్థానిక గొల్లగూడెంలో గల బీబి సకిన పీర్లపంజాలో ఆదివారం ఉదయం నుండి అత్యంత ఘనంగా జరగనున్నాయ దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని బీబీ సకినా ఆషూర్ ఖానా కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ నుండి విచ్చేసిన మౌలానా సర్కార్ అలీ షమ్స్ షియా ముస్లింలను ఉద్దేశించి ప్రసంగించనున్నారని ఈ కార్యక్రమానికి ముమ్మిడివరం, నగరం, రాజోలు, ద్రాక్షారామం, చెయ్యేరు, అయినాపురం, కాకినాడ,రాజమండ్రి, విశాఖపట్నం,హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొనున్నారని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ వర్ధంతి కార్యక్రమాలకు పాల్గొని చిన్నారి బీబి సకినాకు ఘనంగా నివాళులర్పించాలని.బీబిసకిన ఆషూర్ ఖానా కమిటీ సభ్యులు కోరారు.

## స్థానిక ఎన్నికల్లో జనసేనకు అధిక ప్రాధాన్యం కల్పించాలి



**పెడన,జూలై 18 (వార్తాప్రభ) :** త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీకి తగిన ప్రాధాన్యం కల్పించాలని జనసేన నాయకుడు జయలక్ష్మి సొసైటీ డైరెక్టర్ కూనపురెడ్డి రంగయ్య నాయుడు కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడటంలో తెలుగుదేశం పార్టీకి 60 శాతం జనసేనకు 30 శాతం బీజేపీకి 10 శాతం పాత్ర ఉందని పేర్కొన్నారు. అదే విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. పంచాయతీ ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికల్లో జనసేనకు 60 శాతం టీడీపీకి 30 శాతం, బీజేపీకి 10 శాతం అవకాశం కల్పించాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో జనసేన, టీడీపీకి చెరో 40 శాతం, బీజేపీకి 20 శాతం వాటా ఇవ్వడం సముచితమని తెలిపారు. అలాగే పార్టీ బలోపేతం కోసం వార్డు ఇన్‌చార్జులు గ్రామ మండల టౌన్ అధ్యక్షులు నియోజకవర్గ ఇన్‌చార్జీల నియామకాలను వేగవంతం చేయాలని కోరారు. జనసేన ఆవిర్భావం నుంచి 14 సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఇచ్చి పదవులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలో వ్యక్తిగత గొప్పతనాలకు తావులేకుండా అందరూ జనసైనికులుగా ఐక్యంగా పనిచేయాలని, పదవులు పొందిన నాయకులు పార్టీకి వన్నె తీసుకొచ్చేలా ప్రజల్లో సేవ చేయాలని అన్నారు. బెదిరింపులు, స్వార్థాలకు లొంగకుండా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలని జనసైనికులకు కూనపురెడ్డి రంగయ్య నాయుడు కోరారు

# కిసాన్ దివస్‌లో రైతులకు రుణ మంజూరు పత్రాల పంపిణీ

● హనుమాన్ జంక్షన్ రైతు ప్రముఖులకు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఘన సన్మానం

**హనుమాన్ జంక్షన్,జూలై 18 (వార్తాప్రభ) :** బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ జోనల్ కార్యాలయం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే కిసాన్ దివస్ కార్యక్రమాన్ని శనివారం ఉయ్యూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల రైతులకు బ్యాంక్ ఆఫ్ ఇండియా హెడ్ ఆఫీస్ జనరల్ మేనేజర్ అశుతోష్ మిశ్రా, విజయవాడ జోనల్ మేనేజర్ వేగేసిన బంగార్ రాజు, హనుమాన్ జంక్షన్ బ్రాంచ్ మేనేజర్ డోలా సుధాకర్ రుణ మంజూరు పత్రాలు (సాంక్షన్ లెటర్స్) అందజేశారు. అదేవిధంగా, అనేక సంవత్సరాలుగా హనుమాన్ జంక్షన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు వెన్నుదన్నుగా నిలుస్తూ సమాజానికి ఆదర్శంగా నిలిచిన మీర్జాపురం గ్రామానికి చెందిన మండపాటి శివశంకర్ మరియు హనుమాన్ జంక్షన్‌కు చెందిన వెగిరెడ్డి బాలాజీలను ప్రత్యేకంగా శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైతులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొని కిసాన్ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## కాపు సమాజానికి ముద్రగడ సేవలు అమోఘం..

వైసీపీ నాయకుడు మాదాసు



**పెదన,జూలై 18 (వార్తాప్రభ) :** కాపు సమాజానికి ముద్రగడ పద్మనాభం చేసిన సేవలు మరువరానివని వైసీపీ నాయకుడు మాజీ కౌన్సిలర్ మాదాసు బాబురావు అన్నారు. మాజీమంత్రి ముద్రగడ ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయన మృతి పట్ల బాబురావు తీవ్ర సంతాపాన్నితెలుపుతూ రాజకీయాలలో నిస్వార్థంగా పనిచేసిన నాయకుడు ముద్రగడ. అన్ని అన్నారు.అయనలాగా మాట మీద నిలబడేవారు అరుదుగా వుంటారు అని అన్నారు. ఎం ఎల్ ఎ గా ఎంపీ గా మంత్రిగా ప్రజలకు అయన చేసిన సేవలను మాదాసు కొనియాడారు.విలువలతో కూడిన రాజకీయ జీవితాన్ని ఆయన గడిపారని మాదాసు చెప్పారు.

# రంగయ్య అప్పారావుపేటలో అయోధ్య స్వర్ణ బాల రాముని దివ్య దర్శనం

● భక్తిశ్రద్ధల నడుమ స్వర్ణ బాల రాముని దర్శనం.. వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు



**హనుమాన్ జంక్షన్,జూలై 18 (వార్తాప్రభ) :** రంగయ్య అప్పారావుపేట గ్రామంలోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శనివారం అయోధ్య స్వర్ణ బాల రాముని దివ్య దర్శనం అత్యంత వైభవంగా నిర్వహించారు. అయోధ్యలో నిర్మాణంలో ఉన్న శ్రీ కళ్యాణ రాముని దేవాలయం వ్యవస్థాపకులు చల్లా శ్రీనివాస శర్మ స్వర్ణ బాల రాముని విగ్రహం, పవిత్ర పాదుకలు, ధనస్సు, బాణాలను తీసుకువచ్చి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వర్ణ బాల రాముని మంగళ విగ్రహాన్ని దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ ప్రధాన అర్చకులు పల్లావఝ్జల ఉదయ్ కిరణ్ శర్మ వేదమంత్రోచ్చారణల మధ్య విశేష అర్చన, నీరాజనం, మంత్రపుష్పం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం చల్లా శ్రీనివాస శర్మ మాట్లాడుతూ, అయోధ్య శ్రీరామాలయ నిర్మాణ మహాయజ్ఞానికి ఐదు వెండి ఇటుకలను సమర్పించిన అనంతరం శ్రీరాముని అనుగ్రహంతో శ్రీ కళ్యాణ రాముని ఆలయ నిర్మాణ బాధ్యత చేపట్టే దివ్య అవకాశం లభించిందన్నారు. ప్రస్తుతం కళ్యాణ రాముని ఆలయంతో పాటు 108 మంది ఋషులు, మహర్షులు, రామభక్తుల స్మారక మందిరాలతో కూడిన విశిష్ట ఆధ్యాత్మిక క్షేత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. గత పదేళ్లుగా అయోధ్యలో నివసిస్తూ నిత్య అన్నదాన సేవ నిర్వహిస్తూ, భక్తులకు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ఆలయ పర్యవేక్షకులు పరుచూరి రామకృష్ణ సమన్వయ బాధ్యతలు నిర్వహించి, కార్యక్రమం విజయవంతంగా సాగేలా కృషి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ బాల రాముని దివ్య దర్శనం చేసుకుని ప్రత్యేక ఆశీర్వాదాలు పొందారు.

## తల్లికి వందనం పథకంలో కోతలు సరికాదు: వైఎస్సార్‌సీపీ నేత కోడేబోయిన బాబి

● వాగ్దానం ప్రకారం ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇవ్వాలి.. బడ్జెట్‌లో పూర్తి నిధులు కేటాయించాలని డిమాండ్

**హనుమాన్ జంక్షన్,జూలై 18 (వార్తాప్రభ) :** 'తల్లికి వందనం' పథకంలో కోతలు విధించడం సరికాదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున ఎలాంటి కోతలు లేకుండా అందించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు కోడేబోయిన బాబి డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన 'అమ్మ ఒడి' పథకానికే పేరు మార్చి 'తల్లికి వందనం'గా అమలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, గత విద్యా సంవత్సరంలో తల్లుల ఖాతాల్లో కోతలతో నగదు జమ చేసిందని విమర్శించారు. ఈ విద్యా సంవత్సరంలో అయినా రాష్ట్రంలోని 87 లక్షల 41 వేల మంది విద్యార్థులకు పూర్తి స్థాయిలో లబ్ధి చేకూరేలా బడ్జెట్‌లో రూ.13,112.82 కోట్లు కేటాయించి, ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున ఎలాంటి కోతలు లేకుండా జమ చేయాలని ఆయన కోరారు. గతంలో జరిగినట్లుగా కోతలు విధించకుండా చూసే బాధ్యత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్పై ఉందని బాబి పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని పూర్తిగా అమలు చేస్తే ఎక్కువ మంది విద్యార్థులు పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతారని, తద్వారా విద్యార్థుల చేరికలు గణనీయంగా పెరుగుతాయని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.



## మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంకు నివాళులర్పించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



**కిర్లంపూడి,జూలై 18 (వార్తాప్రభ) :** కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి కూటమి శ్రేణులతో చేరుకుని ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే ముద్రగడ తనయులు బాలు,గిరిబాబు,కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే సత్యప్రభ ముద్రగడ మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి ఆయన సేవలను స్మరించుకున్న ఎమ్మెల్యే సత్యప్రభ ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఏపీఆర్డీసీ చైర్మన్ వెన్నా శివ,ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి,నాయకులు సుంకర సోమరాజు లు,బొదిరెడ్డి గోపి,మంతెన వెంకటరమణ,యిటంశెట్టి సూర్య భాస్కర్,బద్ది రామారావు,తమరాల సత్యనారాయణ తదితరులు పాల్గొని ముద్రగడకు నివాళులర్పించారు

# వికాస్ టెక్నో స్కూల్ విద్యార్థుల విజయభేరి

**విస్సన్నపేట,జూలై 18 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన షైనింగ్ స్టార్స్ అవార్డులు వికాస్ టెక్నో స్కూల్ విద్యార్థులు పి లీనాశ్రీ(592) కె సాయి లిఖిత(591) ఎం యశశ్విని(586) బి లహరి(582) ఎం బిందుమాధవి(566 )మార్కులు19 25 -1926 విద్యా సంవత్సరంలో సాధించటం వలన ఈ అవార్డులకు ఎంపిక కావడం జరిగింది అని వికాస్ విద్యా సంస్థల అధినేత నరెడ్ల నర్సిరెడ్డి తెలియజేశారు. విద్యార్థినీ విద్యార్థులను హైస్కూలు టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ ను ఆయన అభినందించారు.



# రోడ్డు వేయండి మహా ప్రభో!!

**43వ డివిజన్ వాసుల కన్నీటి ఆవేదన**

**పన్నులు మావి.. నిర్లక్ష్యం మీదా?**

**ఏళ్లు గడుస్తున్న పట్టించుకోని వైనం**



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 18 (వార్తాప్రభ):**కళ్లు తిరిగే కార్పొరేట్ పన్నులు కడుతున్నాం, మున్సిపాలిటీ ఖజానా నింపుతున్నాం, కానీ మా బతుకుల్లో మాత్రం ఇంకా ఈ బొందల, గడ్డి పెరిగిన రోడ్ల చీకట్లేనా అంటూ 43వ డివిజన్ ప్రజలు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా, పాలకులు మారుతున్నా, క్యాలెండర్ పేజీలు మారుతున్నాయే తప్ప తమ వీధి భాగ్యం మాత్రం మారడం లేదని, అసలు తాము ఈ నగరంలో నివసిస్తున్న మనుషులమేనా లేక ఓట్ల పండగకు మాత్రమే పనికొచ్చే యంత్రాలమా అని స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఒకప్పుడు గుంతల రోడ్డు అనుకున్నది కాస్తా, ఇప్పుడు నరకానికి రహదారిలా మారిపోయిందని, గర్భిణీలు ఈ దారిలో చీకట్లో ప్రయాణించాలంటే, చిన్న పిల్లలు బడికి వెళ్తూ పడి గాయపడుతుంటే ఏ తల్లి గుండె తట్టుకోగలదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా ఠంచనుగా మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నప్పుడు లేని నిర్లక్ష్యం, కనీస సౌకర్యమైన రోడ్డు వేయడంలో ఎందుకు కనిపిస్తోందని, అధికారుల గుండెలు ఇంతలా రాయిలా మారిపోయాయా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చీకటి పడితే ఈ దారిన నడవాలంటేనే వణుకు పుడుతుందని, బైకులపై వెళ్లేవారు ఎప్పుడు ఎక్కడ పడిపోతారో తెలియని ప్రమాదకర పరిస్థితి నెలకొందని, రోజుల తరబడి మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరిగినా పాలకుల నుంచి కేవలం బూటకపు హామీలే తప్ప కాంక్రీట్ అడుగులు పడటం లేదని వారు వాపోతున్నారు. ఎన్నికలప్పుడు చేతులు జోడించి ఓట్లు అడిగినట్లే, ఇప్పుడు మేము కూడా చేతులు జోడించి వేడుకుంటున్నాం, మా గోడును ఆలకించండి, మా పిల్లల భవిష్యత్తును, గాయాల పాలు కాకుండా కనీసం ఇప్పుడైనా స్పందించి వెంటనే రోడ్డు వేయండి మహా ప్రభో అంటూ 43వ డివిజన్ ప్రజలు ఆర్తనాదాలు చేస్తున్నారు.

## ఎస్.ఎం. ఏ.పై అవగాహన పోస్టర్ ను ఆవిష్కరించిన పోలీస్ కమిషనర్



**శేరిలింగంపల్లి,జూలై 18 (వార్తాప్రభ):**స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ)పై అవగాహన కల్పించేందుకు క్యూర్ ఎస్ఎంఏ ఇండియా ఆధ్వర్యంలో నాలుగో ఎడిషన్ 'రన్ ఫర్ ఎస్ఎంఏ--2026'ను ఆగస్టు 9న గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమ పోస్టర్‌ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూర్ ఎస్ఎంఏ ఇండియా సహ వ్యవస్థాపకురాలు శ్రీలక్ష్మి నలం మాట్లాడుతూ 21కే, 10కే, 5కే టైమ్డ్, 5కే నాన్‌టైమ్డ్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రన్‌లో పాల్గొనే వారికి టీషర్ట్, మెడల్, సర్టిఫికెట్ అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాధా రమాదేవి,డాక్టర్ సూర్యప్రభ,నవేద్ ఆలం ఖాన్, అర్చన పాండా,విజయ్ వావిలాల తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**డీఎస్పీ కార్యాలయం, కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా, మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఇల్లందుకు చెందిన టి. మధు కుమార్, ఆటో డ్రైవర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసును కొత్తగూడెం రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి. రవి కుమార్ విచారించి, నిందితుడికి రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ జి. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు కొత్తగూడెం పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు మద్యం సేవించిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపవద్దని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల వాహనంపై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, తద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం కలిగే అవకాశం ఉందని తెలిపారు. మద్యం సేవించిన వారు ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలను వినియోగించుకోవాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని ప్రజలకు సూచించారు

# అశ్వాపురం ఘటనను జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది

- ఆదివాసీ మహిళల గౌరవం, హక్కులకు సంపూర్ణ రక్షణ కల్పించాలి
- మాజీ హెల్త్ డైరెక్టర్ జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు గడల శ్రీనివాసరావు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కొత్తగూడెం,, అశ్వాపురం మండలం, మనుబోతుల పాడు గ్రామపంచాయతీ పరిధిలో ఆదివాసీ మహిళలతో అధికారులు దురుసుగా ప్రవర్తించినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి అని ఘటనను ఖండిస్తున్నట్లు జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు ఆదివాసీ మహిళల గౌరవం, భద్రత, రాజ్యాంగబద్ధ హక్కులు మరియు ప్రజాస్వామ్య విలువలపై తీవ్రమైన దాడిగా పరిగణించాల్సి ఉంటుందని అన్నారు ప్రతి మహిళ గౌరవంగా జీవించే హక్కు కలిగి ఉంది. ముఖ్యంగా ఆదివాసీ మహిళల పట్ల అధికార యంత్రాంగం అత్యంత సున్నితంగా, మానవీయంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందనిఈ ఘటనపై తెలంగాణ ప్రభుత్వం వెంటనే నిష్పక్షపాత, పారదర్శక విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని జనసేన పార్టీ డిమాండ్ చేస్తుందని అధికార దుర్వినియోగం జరిగినట్లు తేలితే, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి అని అన్నారు మహిళల గౌరవాన్ని, ఆదివాసీల హక్కులను కాపాడటం ప్రభుత్వ యంత్రాంగం యొక్క రాజ్యాంగబద్ధ బాధ్యత. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థే భయాందోళనలకు కారణమవ్వకూడదని ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆదివాసీ మహిళల గౌరవాన్ని కాపాడటం అంటే మన సమాజ గౌరవాన్ని కాపాడటమేనాని వారిపై ఎలాంటి అవమానం, అన్యాయం లేదా దౌర్జన్యాన్నీ నాగరిక సమాజం సహించదు అని అన్నారుజనసేన పార్టీ మహిళల గౌరవం, భద్రత, ఆదివాసీల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ విషయంలో ఎప్పుడూ రాజీపడదని న్యాయం, మానవత్వం, సమానత్వం అనే విలువల పట్ల తన నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటిస్తోందని ఈ అంశంపై గౌరవ ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ తక్షణమే స్పందించి, సమగ్ర విచారణ జరిపించి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించి, తప్పు చేసిన వారెవరైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ విజ్ఞప్తి చేస్తోందని అన్నారు

# శిక్షల శాతం పెంచడమే లక్ష్యం!!

● కోర్టు డ్యూటీ అధికారులు పనితీరు మార్చుకోవాలి ● సాక్షులకు ధైర్యం చెప్పండి.. నేరస్థులకు శిక్షలు పడేలా చేయండి ● ఉత్తమ ప్రతిభ కనబరిస్తే ప్రోత్సాహకాలు ● సమన్లు, వారెంట్ల అమలులో నిర్లక్ష్యం వద్దు ● రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా





**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 18 (వార్తాప్రభ):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో కోర్టు డ్యూటీ, కోర్టు లైజనింగ్ పోలీసు అధికారుల పనితీరును మరింత మెరుగు పర్చడంతో పాటు, నేరస్థులకు శిక్షల శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమన్లు, ఎన్‌బీడబ్ల్యూలు, వారెంట్ల అమలును వేగవంతం చేస్తూ నిర్దేశిత గడువులోగా పనుల నాణ్యతను పెంచాలన్నారు. విధుల నిర్వహణలో తలెత్తే పరిపాలనా, సాంకేతిక సమస్యలను దాచకుండా ఉన్నతాధికారుల దృష్టికి తెస్తే శాఖాపరంగా పూర్తి సహకారం అందిస్తామని, ప్రతి అధికారి తన కార్యాచరణను నిరంతరం స్వయం సమీక్ష చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరచడంతో పాటు, వారికి న్యాయ ప్రక్రియపై ముందస్తు అవగాహన కల్పించి, గందరగోళానికి గురికాకుండా ధైర్యంగా, స్పష్టంగా వాంగ్మూలం ఇచ్చేలా మార్గదర్శకత్వం చేయాలని స్పష్టం చేశారు. కేసుల్లో శిక్షలు పడేలా దర్యాప్తు అధికారులు, కోర్టు సిబ్బంది పరస్పర సమన్వయం, సమయపాలన పాటించాలని, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రతి నెల ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని ప్రకటించారు. బదిలీపై వెళ్లిన అధికారులు గతంలో దర్యాప్తు చేసిన కేసుల్లో శిక్షలు పడినా కూడా వారికి తగిన గుర్తింపు, పురస్కారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కమిషనరేట్‌లో శిక్షల శాతాన్ని పెంచడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని, బాధ్యతాయుతంగా ప్రజలకు సమర్థవంతమైన న్యాయ సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిందితులకు శిక్షలు పడడంలో కీలక పాత్ర పోషించిన పలువురు సిబ్బందిని సీపీ శాలువాతో సత్కరించగా, కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కె.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్, బాబురావు, ఎస్ఐ వినీత మరియు కోర్టు లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

# నాలాల పూడికతీత!!

● మేయర్ క్షేత్రస్థాయి పరిశీలన ● వరద ముప్పు నివారణే లక్ష్యం ● రోడ్ల నిర్మాణం, కాలువల పనుల వేగవంతం ● ట్రాన్స్‌జెండర్ల స్థలాల పరిశీలన, అధికారులకు ఆదేశాలు ● పీజీ కళాశాలలో మొక్కలు నాటిన రామగుండం మేయర్ మహంకాళి






**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 18 (వార్తాప్రభ):**రామగుండం నగరంలో వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు రక్షణ, అభివృద్ధి పనులను మేయర్ మహంకాళి స్వామి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గత నాలుగు నెలలుగా సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ, వరద ముప్పు ఎక్కువగా ఉండే నాలాల్లో పూడికతీత పనులను వేగవంతం చేశామని ఆయన తెలిపారు. నాలాల్లోని పిచ్చి చెట్లను తొలగించడం ద్వారా వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధతో వరద ప్రాంతాల్లో కాంక్రీట్ కాలువల నిర్మాణం, తగ్గిన ఉష్ణోగ్రతల నేపథ్యంలో నిలిచిపోయిన రోడ్డు పనులను కూడా ప్రారంభించామని వివరించారు. అంటువ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టామని మేయర్ పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా 38, 39 డివిజన్లలోని పెద్ద నాలా పూడికతీత పనులను కార్పొరేటర్ నెలకంటి రాముతో కలిసి మేయర్ పర్యవేక్షించారు. అనంతరం 46వ డివిజన్‌లో ట్రాన్స్‌జెండర్లకు కేటాయించిన ఇంటి స్థలాలను అత్యవసరంగా శుభ్రం చేసి చదును చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత మేడిపల్లి, పి.కె. రామయ్య కాలనీలలో నిర్మాణంలో ఉన్న రోడ్లు, ప్రతిపాదిత కాలువల స్థలాలను తనిఖీ చేశారు. అనంతరం పీజీ కళాశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. చివరగా నగర పాలక సంస్థ కార్యాలయం నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు రోడ్డు వెడల్పు చేసే అవకాశాలను పరిశీలించారు. ఈ పర్యటనలో కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దోస్త్ ప్రత్యేక విడత షెడ్యూల్ విడుదల!!

● జూలై 20 నుండి జూలై 26 వరకు.. రూ.400 ఫీజు ● ప్రత్యేక కేటగిరీ సర్టిఫికెట్ల పరిశీలన
● సీట్ల కేటాయింపు, కాలేజీ రిపోర్టింగ్ తేదీలు ఖరారు

**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 18 (వార్తాప్రభ):**తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, కళాశాల విద్య కమిషనరేట్ సమన్వయంతో 'దోస్త్' ప్రత్యేక విడత డిగ్రీ ప్రవేశాల షెడ్యూల్‌ను శనివారం అధికారికంగా విడుదల చేసింది. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక విడతను ప్రకటిస్తున్నట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిస్టారెడ్డి, కళాశాలల విద్య కమిషనర్ ఎ.శ్రీదేవసేన ఐఏఎస్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ షెడ్యూల్ ప్రకారం, రూ. 400 నమోదు రుసుముతో ప్రత్యేక విడత రిజిస్ట్రేషన్లు, వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 20వ తేదీ నుండి ప్రారంభమై, జూలై 26 వరకు రిజిస్ట్రేషన్లకు, జూలై 27 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. శారీరక వికలాంగులు, క్యాప్, ఎన్‌సిసి, క్రీడలు, ఇతర అదనపు కార్యకలాపాల ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన జూలై 27న యూనివర్సిటీ హెల్ప్ లైన్ కేంద్రాలలో జరుగుతుంది అని తెలిపారు. జూలై 30వ తేదీన ప్రత్యేక విడత డిగ్రీ సీట్ల కేటాయింపు ఫలితాలను అధికారికంగా వెబ్‌సైట్‌లో ప్రచురిస్తారు. సీట్లు పొందిన విద్యార్థులు జూలై 30 నుండి ఆగస్టు 1వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేసిన విద్యార్థులు జూలై 31 నుండి ఆగస్టు 1వ తేదీల మధ్యలో తమకు కేటాయించిన కళాశాలల్లో నేరుగా రిపోర్ట్ చేయాలని అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటివరకు దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు కూడా ఈ ప్రత్యేక విడతలో రూ. 400 ఫీజు చెల్లించి కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. గత విడతలలో దోస్త్‌లో నమోదై సీటు రాని విద్యార్థులు తమ పాత దోస్త్ ఐడీ, పిన్ నంబర్‌తోనే ఈ ప్రత్యేక విడతకు నేరుగా అర్హులవుతారు. అయితే, ఇప్పటికే కాలేజీల్లో సీట్లు కన్ఫర్మ్ చేసుకున్న విద్యార్థులు మాత్రం ఈ ప్రత్యేక విడతకు అర్హులు కారని అధికారులు నిబంధనలలో స్పష్టం చేశారు. డిగ్రీ సీటు సాధించే అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి విద్యార్థులు వీలైనన్ని ఎక్కువ వెబ్ ఆప్షన్లను ఎంచుకోవాలని అధికారులు ఈ సందర్భంగా సూచించారు.

# మొట్ట పంటల వైపు దృష్టి సారించాలి..

**పాపన్న పేట, జూలై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర ప్రభుత్వ జిల్లా వ్యవసాయ శాఖ సూచనల మేరకు పాపన్నపేట మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం మల్లంపేట రైతు వేదికలో వివిధ గ్రామాలకు చెందిన రైతులకు ఎల్ నినో ప్రభావం, వాతావరణ మార్పులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, వాతావరణ శాఖ సమాచారం ప్రకారం (ఎల్ నినో) అనేది మధ్య, తూర్పు భూమధ్యరేఖా పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల నీటి ఉష్ణోగ్రత సాధారణం కంటే అధికంగా పెరగడం వల్ల ఏర్పడే సహజ వాతావరణ విషయమని వివరించారు.

# వార్తా ప్రభ

# హైదరాబాద్

## శిల్పా రామంలో పలదించిన వారాంతపు సంస్కృతిక కార్యక్రమాలు





**శేరిలింగంపల్లి,జూలై 18 (వార్తాప్రభ):** శిల్పారామం మాదాపూర్‌లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం నిర్వహించిన భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి .బెంగళూరుకు చెందిన భరతనాట్య కళాకారిణి సురభి చంద్రశేఖర్ సరస్వతి పుష్పాంజలి,దుర్గాదేవి స్తుతి, పదం, దేవర్ణమా, బృందావ తిల్లాన అంశాలను ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. తాండవం ది స్కూల్ ఆఫ్ కూచిపూడి నాట్య గురువు డాక్టర్ మనోజ శిష్యబృందం మూషికవాహన, వినాయక స్తుతి, అన్నమాచార్య కీర్తన, తారంగం, నటరాజ స్తిరం, శివ పంచాక్షరీ, నర్తన గణపతి, భామాకలాపం అంశాలను ప్రదర్శించి ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో హాసిని, చైత్ర, షణ్ముఖ్, లాస్య, నిత్య, తన్విక, శ్రావ్య, అక్షిత, భవ్య తదితర కళాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి యోగా ఆచార్యులు జగన్ గురూజీ,డాక్టర్ శ్రీనివాస వరప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై కళాకారులను అభినందించారు.

## మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయండి

**అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే గాంధీ**



**శేరిలింగంపల్లి,జూలై 18 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చెరువుల సుందరీకరణ,సంరక్షణ, అభివృద్ధి పనులపై ఇరిగేషన్ అధికారులతో పాటు తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ చెరువుల సుందరీకరణ,యూజీడీ మల్లింపు పైప్‌లైన్, ఫెన్సింగ్, చెరువు కట్ట బలోపేతం,వాకింగ్ ట్రాక్ తదితర పనులను నాణ్యతతో,ఎలాంటి జాప్యం లేకుండా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువుల్లోకి మురుగు నీరు చేరకుండా ప్రత్యేక చర్యలు తీసుకుని ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ఇరిగేషన్ డీఈ ఉదయ్ భాస్కర్,ఏఈ రవికుమార్, ఏఈ లింగప్ప తదితర అధికారులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి కోర్టు నుండి పటాన్ చెరువు మధ్య రెండో బస్సు సర్వీస్ ప్రారంభం



**కూకట్ పల్లి జూలై 18(వార్తా ప్రభ):** బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సౌకర్యార్థం పటాన్‌చెరువు నుంచి కూకట్‌పల్లి కోర్టు వరకు రెండో బస్సు సర్వీసును ప్రారంభించినట్లు బార్ అసోనియేషన్ ప్రకటించింది. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు పటాన్‌చెరు నుంచి బయలుదేరే బస్సు ఆర్‌సీ పురం, బీరంగూడ ఆర్చ్, అశోక్‌నగర్, భెల్ జంక్షన్, చందానగర్, గంగారం, మదీనాగూడ, ఆల్విన్ ఎక్స్ రోడ్స్, మియాపూర్, హైదర్‌నగర్, జేఎన్‌టీయూ, లులు మాల్, నెక్సస్ మాల్, మలేషియన్ టౌన్‌షిప్, 9వ ఫేజ్ మీదుగా ప్రయాణించి ఉదయం 10:15 గంటలకు కూకట్‌పల్లి కోర్టుకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 5:15 గంటలకు కూకట్‌పల్లి కోర్టు నుంచి బయలుదేరి అదే మార్గంలో ప్రయాణించి సాయంత్రం 6:15 గంటలకు పటాన్‌చెరు చేరుకుంటుంది. ఈ ఉచిత రవాణా సౌకర్యాన్ని బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అందరూ సద్వినియోగం చేసుకుని బస్సు సేవ విజయవంతంగా కొనసాగేందుకు సహకరించాలని బార్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.



ఈ బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడానికి సహకరించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బార్ కౌన్సిల్ సభ్యుడు అశోక్ గౌడ్, న్యాయాధికారి మరియు టీజీఎస్‌ఆర్టీసీ అధికారులకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి. పి, ప్రధాన కార్యదర్శి కె. సురేందర్ గౌడ్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

# సంపాదకీయం

## మారణహోమాల నీడలో ప్రపంచ భవిష్యత్తు...!!

విజ్ఞాన సాంకేతిక రంగాలలో మానవాళి ఎంతో పురోగమించిందని సంబరపడుతున్న వేళ... ఆధునిక ప్రపంచాన్ని యుద్ధ మేఘాలు కమ్మేస్తున్నాయి. ఒకవైపు మూడేళ్లు దాటినా ముగింపు లేని రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం, మరోవైపు మధ్యప్రాచ్యాన్ని నిరంతరం భయాందోళనల్లో ముంచెత్తుతున్న ఇరాన్-అమెరికా ప్రచ్ఛన్న సమరం గ్లోబల్ విలేజ్ (ప్రపంచ గ్రామం)ను ముక్కలు చేస్తున్నాయి. ఈ యుద్ధాల తూటాలు కేవలం సరిహద్దులకే పరిమితం కావడం లేదు; వాటి తాలూకు ఆర్థిక, సామాజిక శకలాలు ప్రపంచంలోని ప్రతి సామాన్యుడిని గాయపరుస్తున్నాయి. గత కొన్ని శతాబ్దాలుగా నిర్మించుకున్న అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ, సరఫరా గొలుసులు ఈ ఘర్షణల వల్ల ఒక్కసారిగా కుప్పకూలాయి. ఉక్రెయిన్ సంక్షోభం ప్రపంచానికి ఆహార భద్రత లేకుండా చేస్తే, ఇరాన్-అమెరికా ఉద్రిక్తతలు ఇంధన భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. హోర్ముజ్ జలసంధి లేదా ఎర్ర సముద్రంలో స్వల్ప అలజడి రేగినా... ఆసియా, ఆఫ్రికా దేశాలలో చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నిత్యావసరాల ధరలు పెరిగి, అభివృద్ధి చెందుతున్న దేశాలలో ద్రవ్యోల్బణం పేదరిక నిర్మూలన దిశగా పడిన అడుగులను వెనక్కి లాగుతోంది. దీనికంటే ప్రమాదకరమైన పరిణామం ఏంటంటే... ప్రపంచం మళ్లీ "కొత్త శీతల సమరం" వైపు వేగంగా అడుగులు వేయడం. ఒకవైపు అమెరికా-పాశ్చాత్య దేశాల కూటమి, మరోవైపు రష్యా-చైనా-ఇరాన్ వ్యూహాత్మక అక్షం ప్రపంచాన్ని రెండు ధృవాలుగా చీల్చేస్తున్నాయి. ఈ పెత్తందారీ పోరులో ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ శాంతి సంస్థలు ముసలి పులుల్లా మారిపోయి, కేవలం తీర్మానాలకు మాత్రమే పరిమితమవ్వడం విషాదకరం. తమ రక్షణ కోసం ప్రతి దేశం ఇప్పుడు ప్రజా సంక్షేమ బడ్జెట్లను కోసి, ఆయుధాల కొనుగోళ్లకు నిధులు మళ్లిస్తోంది. విద్యా, వైద్యం, వాతావరణ మార్పులపై ఖర్చు చేయాల్సిన సొమ్ము... వినాశకరమైన క్షిపణులు, డ్రోన్ల తయారీకి తరలిపోతోంది. యుద్ధాల వల్ల ఏ దేశమూ శాశ్వత విజయాన్ని సాధించలేదు సదా నష్టాన్ని తప్ప. ఆయుధ వ్యాపారుల లాభాల కోసం, పాలకుల అహాల కోసం అమాయక ప్రజల ప్రాణాలను బలిపెట్టడం ఆధునిక నాగరికతకే అవమానం. ఇప్పటికైనా అంతర్జాతీయ సమాజం కళ్లు తెరవాలి. బెదిరింపులు, ఆర్థిక ఆంక్షలు సమస్యకు పరిష్కారం కావని గుర్తించాలి. తక్షణమే ఇరు పక్షాలు పట్టింపులను పక్కనబెట్టి చర్చల మేజా ముందుకు రావాలి. ప్రపంచానికి ఇప్పుడు కావాల్సింది ఆయుధాల గర్జన కాదు... శాంతియుత సహజీవనం.

## సర్దార్ మరుపిళ్ల చిట్టి కి ఘన నివాళులు..



విజయవాడ పశ్చిమ జులై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి )స్వాతంత్ర సమరయోధుడు, మాజీ శాసనసభ్యులు, స్వర్గీయ సర్దార్ మరుపిళ్ల చిట్టి 55 వ వర్ధంతి వేడుకలు చిట్టినగర్ లో శనివారం ఘనంగా జరిపారు. ఏపీ నగరాల యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ పాల్గొని మరుపిళ్ళ చిట్టి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ పేద, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా, విజయవాడ అభివృద్ధికి మరియు కార్మిక సంఘాల ఏర్పాటుకు ఆయన చేసిన సేవలను కొనియాడారు... ఏపీ నగరాల యువజన సంఘం నేతలు. గూడేల శ్రీనివాసరావు , పిళ్ళ ఆనంద్ , బెవర మురళికృష్ణ, తమ్మిన హరిబాబు , జగ్గుపిళ్ళా భాను ప్రతాప్. పిళ్ళ ఆనంద్. మరుపిళ్ళా దేవిప్రసాద్, పోతిన రమేష్. రాళ్లపూడి మాధవ. తదితరులు పాల్గొన్నారు..

## మెరుగైన వైద్యం కోసం ఎల్ ఓ సీలు అందజేత



విజయవాడ పశ్చిమ జులై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి) ఎమ్మెల్యే సుజనా చౌదరి చొరవతో ముఖ్యమంత్రి సహాయనిది నుంచి మంజూరైన ఎల్ ఓ సీలు (లెటర్ ఆఫ్ క్రెడిట్) లను ఎన్డీయే కార్యాలయంలో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్ ,51 వ డివిజన్ బీజేపీ ఇన్చార్జ్ పోలవరపు దుర్గారావు, బీజేపీ నాయకులు దుర్బేసుల హుస్సేన్ తో కలిసి అందజేశారు..49 వ డివిజన్, జోడు బొమ్మల సెంటర్ కు పీ భారతీ (64) అక్యూట్ కిడ్నీ ఇంజ్యూరీ తో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది ఆమెకు మరింత మెరుగైన వైద్యం అందించాలని శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు తెలపడంతో వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 5 లక్షల 65 వేల విలువైన ఎల్ ఓ సీ ను బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా 51 వ డివిజన్ , వాగు సెంటర్ కు చెందిన పీ శివ (18) హెర్నియా తో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 2 లక్షల 47 వేల విలువైన ఎల్ ఓ సీ ను అందజేశారు. త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ ను అందజేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరి కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# గిరిపురం తాగునీరు సురక్షితం..

- ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- డయేరియా కేసులపై నిరంతరం అప్రమత్తం
- ముందు జాగ్రత్తగా బబుల్స్‌తో నీటి సరఫరా
- అసత్య ప్రచారాలు, వదంతులను నమ్మవద్దు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





విజయవాడ పశ్చిమ జులై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)విజయవాడ అర్బన్ పరిధిలోని గిరిపురం ప్రాంతంలో తాగునీటి సరఫరాకు సంబంధించి వదంతులు నమ్మవద్దని.. ఇక్కడి తాగునీరు సురక్షితమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. వైద్య ఆరోగ్యం, నగరపాలక సంస్థ.. సమన్వయ శాఖల అధికారులతో కలిసి పరిస్థితిని అత్యంత ప్రాధాన్యతతో పర్యవేక్షిస్తూ విస్తృత స్థాయిలో క్షేత్రస్థాయి తనిఖీలు, తాగునీటి నాణ్యతను పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, విజయవాడ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డా. జి.లక్ష్మీశ తెలిపారు. గిరిపురం ప్రాంతంలో తాగునీటి సరఫరా సమయంలో ఇళ్ల వద్దనే రెసిడ్యువల్ క్లోరిన్ పరీక్షలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 200కు పైగా నీటి నమూనాలను సేకరించి పరీక్షించామని.. అదేవిధంగా నైట్రేట్, అమ్మోనియా తదితర పారామీటర్లపై కూడా సమగ్రంగా పరిశీలనలు చేపట్టినట్లు పేర్కొన్నారు. మరింత శాస్త్రీయ నిర్ధారణ కోసం నీటి నమూనాలను గుంటూరులోని ఐపీఎం ప్రయోగశాలకు పంపించి రసాయన, బ్యాక్టీరియాలజికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ ఇప్పటివరకు నిర్వహించిన ప్రాథమిక పరీక్షల్లో కార్పొరేషన్ సరఫరా చేస్తున్న తాగునీటిలో ఎలాంటి కలుషిత లక్షణాలు గుర్తించలేదని, రెసిడ్యువల్ క్లోరిన్ స్థాయిలు కూడా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు తేలిందని చెప్పారు. ప్రస్తుతం ప్రజలకు సరఫరా చేస్తున్న నీరుసురక్షితమైన తాగునీరేనని స్పష్టం చేశారు. అయితే ప్రజారోగ్య పరిరక్షణకు మరింత ప్రాధాన్యమిస్తూ తాగునీటిని తప్పనిసరిగా మరిగించి, చల్లార్చిన అనంతరం మాత్రమే వినియోగించాలని ప్రజలకు సూచించారు. ముందుజాగ్రత్త చర్యగా విజయవాడ నగరపాలక సంస్థ మినరల్ వాటర్ ప్లాంట్‌లో ఉత్పత్తి చేస్తున్న మినరల్ వాటర్ బబుల్స్‌ను గిరిపురం ప్రాంతంలోని ప్రతి ఇంటికి ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీటిని అందించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతోందని, ప్రజలు ఎలాంటి అపోహలు లేదా అవాస్తవ ప్రచారాలను నమ్మి ఆందోళన చెందాల్సిన అవసరం.. లేదని జిల్లా కలెక్టర్, వీఎంసీ స్పెషల్ ఆఫీసర్ జి.లక్ష్మీశ సూచించారు.

# పట్టుదలే విజయానికి సోపానం

- హిందూ హై స్కూల్స్ కమిటీ జనరల్ సెక్రటరీ గోపిశెట్టి మల్లయ్య
- కెబిఎన్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారాలు



విజయవాడ పశ్చిమ జులై 18:(వార్తా ప్రభ ప్రతినిధి)శ్రద్ధ, అంకితభావం ఉంటే విద్యార్థులు తాము నిర్ణయించుకున్న లక్ష్యాలను తేలికగా సాధించగలరని, ఆశయాలను సాధించాలన్న పట్టుదలే విజయానికి సోపానమని ఎస్.కె.పి.వి.వి హిందూ హై స్కూల్స్ కమిటీ జనరల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య అన్నారు. మార్చి 2026 పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన కెబిఎన్ జూనియర్ కళాశాల విద్యార్థుల అభినందన కార్యక్రమం శనివారం కళాశాలలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మల్లయ్య మాట్లాడుతూ విద్యార్థి దశలో అనేక ఆకర్షణలు ఎదురవుతాయని, వీటికి బందీకాకుండా ఏకాగ్రతతో చదువు మీద దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రతిభకు పేదరికం అడ్డంకి కాదని తమ విద్యార్థులు మరోసారి నిరూపించారని చెప్పారు. కెబిఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని, అత్యంత సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ఈ విద్యార్థులకు తమ కళాశాల అన్నివిధాలుగా అండగా నిలిచిందని, డిగ్రీ మూడు సంవత్సరాలు కూడా వీరికి ట్యూషన్ ఫీజు లేకుండా తమ కళాశాల పక్షాన ఉచితంగా విద్యను అందిస్తామని ప్రకటించారు. జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.విజయ్ బాబు మాట్లాడుతూ తమ విద్యార్థులు కుంభ జ్యోతి (సిఎస్ఇ గ్రూపు, 983 మార్కులు), వి.ఎస్తేర్ (ఎఅండ్ టి గ్రూపు, 979 మార్కులు), జి.బిల్వగోపాల్ (ఎ అండ్ టి గ్రూపు, 972 మార్కులు), షేక్ సోహెల్ అహ్మద్ (సిఎస్ఇ గ్రూపు, 965 మార్కులు) రాష్ట్ర స్థాయి పురస్కారాలకు ఎంపికయ్యారని, వీరికి త్వరలో జరుగబోయే కార్యక్రమంలో నగదు పురస్కారంతో పాటు, సర్టిఫికెట్, మెడల్ ను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. హిందూ హై స్కూల్స్ కమిటీ ట్రెజరర్ గోళ్ళ బాబా విజయ్ కుమార్, కెబిఎన్ కాలేజీ ట్రెజరర్ ఎం.వి.కె.హరగోపాల్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, హిందూ హై స్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, కెబిఎన్ కాలేజీ ప్రెసిడెంట్ ఉసిరిక ఉమామహేశ్వరరావు, హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రెసిడెంట్ టి శేషయ్య, తదితరులు విద్యార్థులను అభినందించారు. తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో గుర్తింపుపొందినందుకు ఆనందంగా విద్యార్థులు బాణసంచా కాల్చి సందడి చేసారు.

# వాయు కాలుష్యం తగ్గించే దిశగా ఎండ్ టు ఎండ్ రోడ్డులు



విజయవాడ పశ్చిమ జులై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)విజయవాడ నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కాకుండా వాయు కాలుష్యం తగ్గించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భారతి నగర్ మరియు గురునానక్ కాలనీలో చేపట్టనున్న రూ.3.02 కోట్ల విలువైన ఎండ్ టు ఎండ్ రహదారి అభివృద్ధి పనులకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మాత్యులు కింజరపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం ఎయిర్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం నిధులతో చేపట్టనున్న ఈ పనుల్లో భాగంగా 4వ డివిజన్‌లోని భారతీనగర్ మెయిన్ రోడ్డులో హాట్‌మిక్స్ బీటీ రోడ్డు, పేవర్ బ్లాకుల నిర్మాణ పనులను రూ.1.10 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నారు. 650 మీటర్ల పొడవు, 14 మీటర్ల వెడల్పుతో రహదారిని అభివృద్ధి చేయడంతో పాటు సాధ్యమైన చోట్ల ఇరువైపులా 1.20 మీటర్ల వెడల్పుతో పేవర్ బ్లాక్ ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేయనున్నారు. అలాగే 10వ డివిజన్‌లో గురునానక్ కాలనీ రోడ్డు నుండి పంటకాలువ రోడ్డు వరకు ఉన్న ఫన్‌టైమ్స్ రోడ్డులో మిగిలిన వెడల్పునకు సీసీ రోడ్డు, పేవర్ బ్లాకుల నిర్మాణ పనులను రూ.1.92 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. 690 మీటర్ల పొడవున ఈ పనులు నిర్వహించనున్నారని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా నాణ్యమైన మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, పాదచారులకు సురక్షితమైన ఫుట్‌పాత్‌లు, కాలుష్య నియంత్రణ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులు విజయవాడ నగరం లో వాయు కాలుష్యం తగ్గుముఖం పడుతుందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకుంటూ నగరాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని) మాట్లాడుతూ విజయవాడ నగర అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌరవనీయులు నారా చంద్రబాబు నాయుడు గారు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు, ఆధునిక మౌలిక వసతులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగర అభివృద్ధిలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా రహదారుల నాణ్యత మెరుగుపడటంతో పాటు పాదచారుల భద్రత పెరుగుతుంది. దుమ్ము కాలుష్యం తగ్గి నగర వాయు నాణ్యత మెరుగుపడుతుందని అన్నారు. రవాణా సౌలభ్యం, డ్రైనేజీ వ్యవస్థ, ప్రజల ప్రయాణ భద్రత మరింత మెరుగవుతాయని తెలిపారు. నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ విజయవాడ నగరంలో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నారని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేసి మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ప్రజల సూచనలు, సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ విజయవాడ నగరంలో వాయు కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఎండ్ టు ఎండ్ రహదారుల నిర్మాణంతో పాటుగా, వర్టికల్ గార్డెన్స్, ఎవెన్యూ ప్లాంటేషన్, రోడ్ల మధ్య డివైడర్లలో గ్రీనరీ అభివృద్ధి, పచ్చదనం పెంపు, ప్రధాన కూడళ్ళో ఫౌంటెన్స్ వంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నామని చెప్పారు. వీటి ద్వారా దుమ్ము కాలుష్యం తగ్గడమే కాకుండా నగర వాయు నాణ్యత మెరుగుపడి, ప్రజలకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సుస్థిర అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ కుమ్మరి శాలివాహన వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఈశ్వర్, విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, పర్యవేక్షణ ఇంజనీర్లు చంద్రశేఖర్, దుష్యంత్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇన్చార్జ్) రామారావు, డీఈలు, ఏఈలు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# కళాశాల విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు



చేజర్ల జూలై 18 (వార్తాప్రభ) చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు విద్యార్థులకు పిటీఎం కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థినికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన విద్యార్థులకు కంటి అద్దాలు కూడా ఉచితంగా ఇవ్వడం జరిగింది. ఈ పరీక్ష విధానంలో నెల్లూరు ప్రభుత్వ వైద్య అధికారిణి డాక్టర్ శైలజ మరియు కళాశాల ఇన్ ఛార్జ్ ప్రిన్సిపాల్ ఏ.చిరంజీవి చౌదరి అధ్యాపకులు మరియు అధ్యాప కేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పై అవగాహన

### సుజనా మిత్ర కోఆర్డినేటర్లకు అవగాహన కల్పించినసీ ఎల్ టీ సీ సమత.






విజయవాడ పశ్చిమ జులై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి) ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో పశ్చిమ నియోజకవర్గంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన2.0 మరియు ఏపీ టిడ్కో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఎంపిక పారదర్శకంగా జరపడానికి సుజనా మిత్రా కోఆర్డినేటర్లు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ , కూటమి నేతలతో కలిసి భవానిపురం ఎన్డీయే కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏపీ టిడ్కో సీ ఎల్ టీ సీ సమత పాల్గొని సుజనా మిత్ర కోఆర్డినేటర్లకు అవగాహన కల్పించారు.. ఈ సందర్భంగా సమత మాట్లాడుతూ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఏపీ టిడ్కో వెబ్సైట్ నందు పొందుపరచడం, ప్రిలిమినరీ డిమాండ్ సర్వే, మరియు అర్హత ప్రమాణాలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఏపీ టిడ్కో వెబ్సైట్ మరియు పీ ఎం ఏ వై 2.0 నందు దరఖాస్తుదారులు స్వతహాగా నమోదు చేసుకునే విధానం గురించి వివరించారుదరఖాస్తుదారులకు ఉండవలసిన అర్హత ప్రమాణాలు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం తదితర విషయాలను సుజనా మిత్రాలకు వెల్లడించారు.. మాజీ కార్పొరేటర్ పైడి మాల సుభాషిణి , పోతిన భేసు కంటేశ్వరుడు, కామ దేవరాజ్, బొల్లేపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు..

## గొల్లపూడిలో భక్తిశ్రద్ధలతో జగన్నాథ రథయాత్ర మహోత్సవం

### రథయాత్రలో పాల్గొన్న మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



గొల్లపూడి, జూలై 18 (వార్తా ప్రభ ప్రతినిధి):విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో హరేకృష్ణ భక్తుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం--2026 భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. అయ్యప్ప ఘాట్ వద్ద ప్రారంభమైన ఈ రథయాత్ర గొల్లపూడి ప్రధాన వీధుల గుండా ఊరేగుతూ అయ్యప్ప స్వామి దేవస్థానం ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర అమ్మవార్ల దివ్య దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ రథయాత్రలో పాల్గొని శ్రీ జగన్నాథ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని లాగి భక్తులతో కలిసి హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. జగన్నాథ స్వామి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ప్రార్థించారు. బిజెపి సీనియర్ నాయకులు నూతలపాటి బాలకోటేశ్వరావు (బాల), స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఆంధ్ర ప్రదేశ్ నగరాల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మరుపిళ్ళ చిట్టి కి ఘన నివాళులు





విజయవాడ పశ్చిమజులై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)ఆంధ్రప్రదేశ్ నగరాల సంఘం అధ్యక్షులు బాయన బాబూజీ(బాబ్జీ)ఆధ్వర్యంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ శాసనసభ్యులు స్వర్గీయ మరుపిళ్ళచిట్టి 55వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. శనివారం స్థానిక చిట్టినగర్ సెంటర్లో ఉన్న చిట్టి కాంస్య విగ్రహం కు బాయన బాబ్జి, పైడి రావు సహా పలువురు నగర సామాజిక వర్గ నేతలు కుల పెద్దలు పూలదండలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాయన బాబ్జి, పైడిరావు మీడియాతో మాట్లాడారు. విజయవాడ నగరాభివృద్ధికి స్వర్గీయ మరుపిళ్ళ చిట్టి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. చిట్టినగర్ నెహ్రూ బొమ్మ సెంటర్ సమీపంలో మరుపిళ్ళ చిట్టి విగ్రహ ఏర్పాటుకు గత ప్రభుత్వంలోమాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు, మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి చిత్తశుద్ధితో కృషి చేశారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ నగరాల సంఘం ద్వారా 50 సంవత్సరాలుగా నగరాల అభ్యున్నతికి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. నగరాలకు బీసీ హోదా కల్పించడం కోసం సంఘం తరఫున విశేష కృషి చేసినట్లు పేర్కొన్నారు. నగరాల అభివృద్ధి కోసం రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బాయన బాబ్జి తెలియజేశారు.

# చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం...

● మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ● కొండపల్లిలో తడి, పొడి చెత్త వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ ను వర్చువల్ గా ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు





**ఇబ్రహీంపట్నం, జులై 18(వార్తా ప్రభ ప్రతినిధి):** పట్టణాల్లో రోజురోజుకు పెరుగుతున్న చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా తడి మరియు పొడి చెత్త వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తెలిపారు. కొండపల్లి పట్టణ పరిధిలోని ఇబ్రహీంపట్నం ఖిల్లా రోడ్డులో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం (తడి, పొడి చెత్త వేధవ ప్రాసెసింగ్ ప్లాంట్)ను శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించగా, పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ అధికారికంగా ప్రారంభించారు.ప్లాంట్ ను పరిశీలించిన ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో తొలిసారిగా కొండపల్లి మున్సిపాలిటీలో ఈ ప్లాంట్ ను నెలకొల్పినట్లు చెప్పారు. డ్రెయినేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల కొద్దిపాటి వర్షాలకి డ్రెయిన్లు పొంగి ప్రవహించి లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా మున్సిపాలిటీలో లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెత్త మొత్తాన్ని పెద్ద ఎత్తున గుంటూరు వద్ద వేస్ట్ టు పవర్ జనరేషన్ ప్రాజెక్టుకు తరలించినట్లు చెప్పారు.ఈ ప్లాంట్ ను సద్వినియోగం చేసుకుని కొండపల్లి మున్సిపాలిటీ కాలుష్య రహితంగా తీర్చిదిద్దుతామన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెస్ చేయడం ద్వారా కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని చెప్పారు. ఇలాంటి ఆధునిక వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు పర్యావరణ పరిరక్షణకు ఎంత దోహదపడటంతో పాటు ప్రజలకు పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందిస్తాయని తెలిపారు.పట్టణంలో చెత్త పేరుకుపోవడం వల్ల కలిగే దుర్వాసనలు, వ్యాధుల వ్యాప్తి, భూ కాలుష్యం, వాయు కాలుష్యం వంటి సమస్యలను నివారించడంలో ఈ ప్లాంట్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి పొడి చెత్తను వేర్వేరుగా అందించడం ద్వారా ఈ ప్లాంట్ పూర్తిస్థాయిలో సద్వినియోగం అవుతుందని,ప్రజల సహకారం ఉంటేనే కాలుష్య రహిత కొండపల్లి లక్ష్యాన్ని సాధించగలమని చెప్పారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి అక్కల రామమోహనరావు (గాంధీ), మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కౌన్సిలర్ లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అరుంధతి మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు పౌష్టికాహార పంపిణీ



**గన్నవరం, జూలై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సమాజ సేవే ధ్యేయంగా పనిచేస్తున్న అరుంధతి మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు కొమ్మని కవిత మాట్లాడుతూ, వృద్ధుల ఆరోగ్యం ప్రతి కుటుంబం, సమాజం బాధ్యత అని అన్నారు. వృద్ధులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు వారికి ఆత్మీయతను పంచడం కూడా ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు.కార్యక్రమంలో వృద్ధులకు పాలు, పండ్లు, బిస్కెట్లు, ప్రోటీన్ ఆహార పదార్థాలు మరియు ఇతర పౌష్టికాహార వస్తువులను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని వృద్ధులు అభినందిస్తూ సంఘం అధ్యక్షురాలు కొమ్మని కవితతో పాటు సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## స్వచ్ఛాంధ్రకు శ్రీకారం- విద్యార్థులతో హరిత యజ్ఞం నిర్వహించిన మైత్రి ఫౌండేషన్.



**మచిలీపట్నం జూలై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రభుత్వం చేపట్టిన "స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర" కార్యక్రమం మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బందరు మండలం కరహగ్రహారం, క్యాంప్‌బెల్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో నిర్వహించారు. 20 నీడనిచ్చే మొక్కలను నాటించారు.జిల్లా అటవీశాఖ అధికారుల సహకారంతో నందమూరు నర్సరీ నుండి సేకరించిన మొక్కలను విద్యార్థుల చేతుల మీదుగా నాటించి, వాటి సంరక్షణ బాధ్యత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి ఉపాధ్యాయ బృందానికి అప్పగించారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు వరప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, నేడు నాటిన మొక్కలను భావి తరాల కోసం విద్యార్థులు ప్రేమగా సంరక్షించాలని పిలుపునిచ్చారు.ఉపాధ్యాయులు, మైత్రి ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు వరప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.గాయత్రి,క్యాంపు బెల్ పేట మాజీ ప్రెసిడెంట్ నాగుల్ మీరా, కోశాధికారి అనిల్, ఉపాధ్యక్షురాలు రమాదేవి, గౌరవ సభ్యులు సుధీంద్ర కుమార్, మాజీ ప్రెసిడెంట్ వి. నాగుల్ మీరా, ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మచిలీపట్నం సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలలో ఘనంగా ఆర్ట్ ఎక్స్పో.






**మచిలీపట్నం జూలై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించి, వారి ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో మచిలీపట్నంలోని సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం ఆర్ట్ ఎక్స్పో--2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ వినయ్ ప్రారంభించి విద్యార్థులు రూపొందించిన కళాఖండాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పుస్తక విద్యతో పాటు కళలు, సృజనాత్మక ఆలోచనలు కూడా విద్యార్థుల సమగ్ర వికాసానికి ఎంతో అవసరమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఆర్ట్ ఎక్స్పోలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పెయింటింగ్స్, డ్రాయింగ్స్, క్రాఫ్ట్ వస్తువులు, పర్యావరణ పరిరక్షణ, విజ్ఞానశాస్త్రం, సామాజిక అంశాలపై రూపొందించిన వివిధ కళాకృతులను ప్రదర్శించారు. విద్యార్థుల సృజనాత్మకత, రంగుల సమన్వయం, వినూత్న ఆలోచనలతో రూపొందించిన కళాఖండాలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ఇటువంటి సృజనాత్మక కార్యక్రమాలు విద్యార్థుల్లో కళాత్మక నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా, వారి ఆలోచనా సామర్థ్యం, ఊహాశక్తి, ఆవిష్కరణ దృక్పథాన్ని మరింత అభివృద్ధి చేస్తాయని పాఠశాల నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లిస్సమ్మ, ఉపాధ్యాయులు ప్రిసిల్లా, పావని, నిర్మల, కళ్యాణి, పిఈటి రాజేష్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.

## వైసిపి కార్యకర్త కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే వంశీ ఆర్థిక సహకారం



**గన్నవరం, జూలై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి):**గన్నవరం నియోజకవర్గం, పాతపాడు గ్రామంలో వైయస్సార్ సిపి కార్యకర్త గోల్కొండ శేషయ్య మాతృ మూర్తి అకాల మరణం చెందారు డా"వల్లభనేని వంశీ ఆదేశాల మేరకు వారి కుటుంబానికి కర్మని ఖర్చుల నిమిత్తం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున 10.000 రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అధ్యక్షులు మందాశివరాజు తో పాటు కలపాల అబ్రహం ఈద కోటిరెడ్డి కల్లేపల్లి సీతారామరాజు నల్లమోతు చినబాబు కొమరవల్లి అనిల్ బుద్ధాల రూబేను పాల్గొనడం జరిగింది.

## ఈనెల 20న మెగా జాబ్ మేళా

### నోబుల్ డిగ్రీ కళాశాలలో నిర్వహణ- నిరుద్యోగ యువతకు ఉద్యోగాల సువర్ణావకాశం



**మచిలీపట్నం జూలై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో డైరెక్టరేట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ (సోమవారం) ఉదయం 9 గంటలకు మచిలీపట్నంలోని నోబుల్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ తెలిపారు.ఈ జాబ్ మేళాలో శ్రీరామ్ ఫైనాన్స్, ఎస్ఎస్వీ సొల్యూషన్స్, ఇన్నోవ్‌సోర్స్, జస్ట్ డయల్ లిమిటెడ్, రాండ్‌స్టాడ్, వరుణ్ మోటార్స్, ఆర్ఆర్ ట్రేడర్స్ అండ్ మాన్యుఫాక్చరర్స్, టికోనా ఇన్‌ఫైనెట్, టాటా ఎలక్ట్రానిక్స్, ఎంఆర్ఎఫ్ లిమిటెడ్, టీవీఎస్, వసంత, ఫ్లిప్‌కార్ట్, బ్లింకిట్, మ్యాన్‌పవర్, డైకిన్, డిక్సన్ తదితర ప్రముఖ కంపెనీలు పాల్గొని వివిధ విభాగాల్లో ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు ఉపాధి అధికారి, డిజిగ్నేటెడ్ ఆఫీసర్ వై. సత్యబ్రహ్మం అన్నారు.10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఫార్మసీ విద్యార్హతలు పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత ఈ జాబ్ మేళాకు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఆకర్షణీయమైన వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించే ఉద్యోగ అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు.అభ్యర్థులు ముందుగా నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకుని, రెజ్యూమ్ లేదా బయోడేటా, ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్, పాన్ కార్డు, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు.మరిన్ని వివరాలకు 8142416211, 9966489796 నంబర్లను సంప్రదించాలని అధికారులు తెలిపారు

## ప్రజారోగ్యమే లక్ష్యంగా "సుజనా ఫౌండేషన్" ఉచిత వైద్య శిబిరాలు..






**విజయవాడ పశ్చిమ జులై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సమాజసేవే మహోన్నత ఆశయంగా, ప్రజారోగ్యమే లక్ష్యంగా, ఎమ్మెల్యే సుజనా చౌదరి , "సుజనా ఫౌండేషన్" ద్వారా పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి శని, ఆదివారాలలో ఉచిత మెగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు.. వన్ టౌన్, గాంధీజీ మహిళా కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు.. కార్పొరేట్ ఆసుపత్రులైన పీ వీ ఆర్, శంకర నేత్ర చికిత్సాలయ, వాసన్ ఐ కేర్ వంటి అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు డెంటల్, కంటి సమస్యలు, ఈ సీ జీ, 2డీ ఎకో,ఎక్స్ రే, మరియు రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు ...మాజీ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు,ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగం కన్వీనర్ సోలంకి రాజు, 37 వ డివిజన్ బీజేపీ ఇన్చార్జ్ హరీష్ వ్యాస్, టీడీపీ కోఆర్డినేటర్ పిళ్ళ సుదర్శన్, సుజనా ఫౌండేషన్ సిబ్బంది , సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొని ఈ వైద్య శిబిరంలో తమ సేవలందించారు..

## పశ్చిమలో ఘనంగా స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ మరుపిళ్ల చిట్టి వర్ధంతి కార్యక్రమం

### నివాళులర్పించిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి





**విజయవాడ పశ్చిమ జూలై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భారత స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ శాసనసభ్యులు సర్దార్ మరుపిళ్ల చిట్టి వర్ధంతి కార్యక్రమాలను విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో శనివారం నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మాజీ మంత్రి, పశ్చిమ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు కూడళ్లలో ఉన్న మరుపిళ్ల చిట్టి విగ్రహాలకు వారు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.?ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విజయవాడ నగరానికి, ముఖ్యంగా పశ్చిమ నియోజకవర్గానికి సర్దార్ మరుపిళ్ల చిట్టి చేసిన సేవలు ఎప్పటికీ మరవలేనివని కొనియాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున, అలాగే చిట్టి అభిమానుల ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఆయన విగ్రహాలు ఉన్న అన్ని ప్రాంతాలలో వర్ధంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు.?మరుపిళ్ల చిట్టి ఒక మహోన్నతమైన స్వతంత్ర సమరయోధుడిగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడటమే కాకుండా, ఈ ప్రాంత శాసనసభ్యుడిగా నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించారని వెలంపల్లి గుర్తుచేశారు. ఈ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆయనకు ఉన్న సొంత ఆస్తులను సైతం ప్రభుత్వానికి ధారాదత్తం చేశారని, అనేక సేవా కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో నిలిచిపోయిన మహనీయుడు చిట్టి అని కొనియాడారు. ఆయన ఆశయాలు, అడుగుజాడల్లోనే నడవాలనే దృఢ సంకల్పంతో తామంతా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు.?గతంలో మరుపిళ్ల చిట్టి ప్రాతినిధ్యం వహించిన ఇదే పశ్చిమ నియోజకవర్గం నుండి తాను రెండు సార్లు శాసనసభ్యుడిగా ఎన్నికవ్వడం పట్ల వెలంపల్లి శ్రీనివాసరావు సంతోషాన్ని, గర్వాన్ని వ్యక్తం చేశారు. చిట్టి పరిపాలించిన నియోజకవర్గంలో సేవ చేసే అవకాశం తనకు రావడం ఆ భగవంతుడిచ్చిన ఆశీస్సులుగా భావిస్తున్నానని అన్నారు. చిట్టి ప్రారంభించిన మంచి కార్యక్రమాలను, ఆశయాలను ప్రతి ఒక్కటి కూడా భవిష్యత్తులోనూ కొనసాగించే విధంగా తామంతా కట్టుబడి ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.?చిట్టి నగర్ ప్రాంతం అందరికీ సుపరిచితమే అయినప్పటికీ, ఆ ఏరియా ప్రాముఖ్యతను మరింత పెంచేలా చిట్టి విగ్రహాన్ని అక్కడ ఏర్పాటు చేయడం జరిగిందని వెలంపల్లి గుర్తుచేశారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో, అప్పటి మేయర్ రాయన భాగ్యలక్ష్మి , నగరాల సంఘం మరియు నగర పెద్దలందరి సహకారంతో అక్కడ ఆ మహనీయుని చక్కటి విగ్రహాన్ని ప్రతిష్ఠించామన్నారు. ఈ రోజు 'చిట్టి నగర్' అంటే అది 'మరుపిళ్ల చిట్టి నగర్' అని ప్రతి ఒక్కరికీ తెలిసేలా ఆనాడు ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేశామని చెప్పారు. ప్రతి ఒక్కరూ మరుపిళ్ల చిట్టి గారి ఆశయాలను, వారి ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకువెళ్లాలని ఆయన మనస్ఫూర్తిగా పిలుపునిచ్చారు.?కాగా, ఈ వర్ధంతి కార్యక్రమాల్లో భాగంగా స్థానిక 1టౌన్ లోని రమణయ్య కూల్ డ్రింక్ షాప్ సెంటర్, చిట్టినగర్ జంక్షన్, 47వ డివిజన్ లోని మరుపిళ్ల చిట్టి పార్క్, మరియు మహంతిపురంలోని రాఘవ రెడ్డి వీధిలో గల మరుపిళ్ల చిట్టి విగ్రహాల వద్ద వెలంపల్లి శ్రీనివాసరావు, రాయన భాగ్యలక్ష్మి తదితరులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.ఈ కార్యక్రమాల్లో మాజీ చైర్మన్ లు, మాజీ కార్పొరేటర్ లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు చిట్టి అభిమానులు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపికైన చేజర్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



**చేజర్ల జూలై 18 (వార్తాప్రభ)** పదవ తరగతి 2026 పబ్లిక్ పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డులను అందజేయడం జరుగుతుంది. చేజర్ల మండలంలో మొత్తం 6 మందికి షైనింగ్ స్టార్స్ అవార్డులను ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది.6 మందిలో 5 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి ప్రతిభ కనబరిచి సత్తా చాటారు.ప్రభుత్వ పాఠశాలలకు మంచి గుర్తింపుతో పాటు ట్రిబుల్ ఐటీ లో సీట్లు సాధించడంతో ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారులు హర్షం వ్యక్తం చేశారు.జిల్లాలో మొత్తం 224 మంది షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపిక కాగా వీరిని ప్రజా ప్రతినిధులు అధికారుల చేతులు మీదుగా 20వ తేదీన సోమవారం ఉదయం 9 గంటలకు జరిగే నెల్లూరు కస్తూరిబా కళాక్షేత్రం నందు విద్యార్థులకు సర్టిఫికెట్ మెమొంటో మరియు 20 వేలు రూపాయలు నగదు ఇచ్చి ఎంపికైన విద్యార్థులను ఘనంగా సత్కరించడం జరుగుతుంది.

## మెప్మా ఆధ్వర్యంలో మన డబ్బులు - మన లెక్కలు అవగాహన ర్యాలి

### ర్యాలీ ప్రారంభించిన చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు



**ఇబ్రహీంపట్నం, జులై 18(వార్తా ప్రభ ప్రతినిధి):**పట్టణ పేదరిక నిర్మాణ సంస్థ (మెప్మా) కొండపల్లి పురపాలక సంఘంపట్టణ మహిళా సమఖ్య ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు 'మన డబ్బులు మన లెక్కలు యాప్ పైన అవగాహన ర్యాలీ నిర్వహించారు. కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సంఘ సభ్యులు అందరు ఆర్థిక లావాదేవీలు తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు. ఈ యాప్ ప్రధాన ఉద్దేశం సంఘం నెల వారి ఆర్థిక లావాదేవీలను డిజిటల్ రూపంలో చూసుకోవచ్చని తెలిపారు. ప్రతి సభ్యురాలికి తమ సంఘం ఆర్థిక వ్యవహారాలపై పూర్తి అవగాహన కల్పించడమే ప్రభుత్వం లక్షమని అన్నారు.ప్రతి ఒక్క సంఘ సభ్యులు తమ ఆర్థిక లెక్కలను యాప్ లో స్వయంగా చూసుకునే స్థాయికి చేరేలా చెప్పటం జరిగినదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు,మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్, పట్టణ మహిళా సమఖ్య ప్రెసిడెంట్ వెంకటేశ్వరమ్మా, కౌన్సిలర్ చుట్టుకుదురు వాసు, మెప్మా సీఎంఎం శ్రీధర్ రావు, సుధారాణి ఆర్పీలు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో ఘనంగా 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛభారత్




**సంగం జూలై 18 (వార్తాప్రభ ప్రతినిధి)** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా సంగం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఆసుపత్రి సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు.మూడో శనివారం ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. ఆసుపత్రి పరిసరాలతో పాటు లోపలి వార్డులు బాత్రూమ్‌లు కాలువలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.రోగులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వైద్యాధికారి తెలిపారు. పరిశుభ్రమైన ఆసుపత్రి వాతావరణం ద్వారా రోగుల్లో అంటువ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని పారిశుధ్యం ప్రతి ఒక్కరి బాధ్యత అని డాక్టర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలు కూడా పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను స్వచ్ఛంగా ఉంచడంలో సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైద్యులు నర్సింగ్ సిబ్బంది పారామెడికల్ సిబ్బంది ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర విజయానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలి

**: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**




**తిరుపతి, జూలై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర" కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇందిర ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో మూడవ శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ), నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్రతో కలిసి బల్క్ వేస్ట్ జనరేటర్‌ను ప్రారంభించారు. రోజుకు ఒక టన్ను వ్యర్థాలను కేవలం 24 గంటల్లో సేంద్రియ ఎరువుగా మార్చే సామర్థ్యం ఈ యంత్రానికి ఉందని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రజలు తమ ఇళ్లను పరిశుభ్రంగా ఉంచినట్లే వీధులు, పరిసరాలు, నగరాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచే బాధ్యతను స్వీకరించాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలతో రూపుదిద్దుకున్న స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. దేశం నలుమూలల నుంచి తిరుపతికి వచ్చే భక్తులకు పరిశుభ్రతలో ఆదర్శ నగరంగా తిరుపతి నిలవాలని ఆయన ఆకాంక్షించారు. వ్యాపారవేత్తలు బల్క్ వేస్ట్ జనరేటర్లను సద్వినియోగం చేసుకోవాలని, నగరపాలక సంస్థ చేపట్టే పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజనీర్ తులసికుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, డీఈలు రమణ, రాజు, మేనేజర్ హాసీమ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## మధ్య తరగతి ప్రజల ప్రామాణిక నమ్మకం టాటా ఉత్పాదనలు

**మార్కెట్లోకి సియెర్రా ఈవి, టియాగో ఈవి నూతన ఉత్పాదనలను విడుదల చేసిన జేబి శ్రీనివాస్, డిటిఓ మురళీమోహన్**





**తిరుపతి, జూలై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయతను సంపాదించుకున్న టాటా మోటార్స్ సంస్థ నూతనంగా రూపొందించిన సియెర్రా ఈవీ, టియాగో ఈవీతో పాటు టియాగో పెట్రోల్ వేరియంట్ వాహనాలను శనివారం తిరుపతి రూరల్ పరిధిలోని విజయభారతి ఆటోమొబైల్స్ షోరూమ్‌లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి మన్నెం శ్రీనివాస ప్రసాద్ (జేబీ శ్రీనివాస్), జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి విజయభారతి ఆటోమొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సభాపతి వెంకటరమణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జేబీ శ్రీనివాస్ మాట్లాడుతూ, నాణ్యత, మన్నిక, భద్రతకు టాటా వాహనాలు ప్రతీకగా నిలిచాయని, అందుకే మధ్యతరగతి ప్రజల్లో టాటా ఉత్పత్తులకు విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ టాటా సంస్థ వాహనాలను రూపొందిస్తోందని పేర్కొన్నారు. డీటీఓ కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూ, రతన్ టాటా దేశానికి నాణ్యమైన ఉత్పత్తులను అందించాలనే సంకల్పంతో పనిచేశారని కొనియాడారు. పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఆటోమొబైల్స్ ఎండీ సభాపతి వెంకటరమణ మాట్లాడుతూ, విజయభారతి ఆటోమొబైల్స్ ద్వారా ప్రతి నెల సగటున 150కుపైగా టాటా వాహనాలు విక్రయిస్తున్నామని, గత నెలలో 205 వాహనాలను వినియోగదారులకు అందించామని తెలిపారు. సియెర్రా ఈవీ, టియాగో ఈవీ బుకింగ్‌లు ప్రారంభించినట్లు వెల్లడించారు. సియెర్రా ఈవీ ప్రారంభ ధర రూ. 18.79 లక్షలు కాగా, టియాగో వేరియంట్ ప్రారంభ ధర రూ. 4.69 లక్షలుగా నిర్ణయించినట్లు చెప్పారు. సియెర్రా ఈవీ రెండు బ్యాటరీ వేరియంట్లలో అందుబాటులో ఉండి, కేవలం 15 నిమిషాల ఫాస్ట్ ఛార్జింగ్‌తో సుమారు 250 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యం కలిగి ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో టాటా మోటార్స్ టీఎస్ఎం గౌతమి, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శివశంకర్, కెనరా బ్యాంక్ రీజినల్ హెడ్ ఉమా రాఘవనాథ్, ఇండియన్ బ్యాంక్ క్రెడిట్ జనరల్ మేనేజర్ నరేష్, ఆటోమొబైల్స్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

### రూ.2.60 కోట్ల వ్యయంతో బాక్స్ డ్రెయిన్ నిర్మాణం

**పనులను పరిశీలించిన వినాయక్ నగర్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి**



**మల్కాజిగిరి జూలై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి):** నూతనంగా ఏర్పడిన కాకతీయనగర్ డివిజన్ పరిధిలోని రేణుకానగర్‌లో సుమారు రూ. 2.60 కోట్ల వ్యయంతో నిర్మించిన బాక్స్ డ్రెయిన్ పనులను వినాయక్ నగర్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్న క్రమంలో తలెత్తిన స్థానిక వివాదాన్ని ఆమె పరిష్కరించారు. పరిశీలన సందర్భంగా ఒక విద్యుత్ స్తంభం ఇంటి గోడను ఆనుకుని ఉండటంతో స్థానికులు వ్యక్తం చేసిన సమస్యను వెంటనే విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల భద్రత దృష్ట్యా మరో అదనపు విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను కోరగా వారు సానుకూలంగా స్పందించారు. అలాగే బాక్స్ డ్రెయిన్ నిర్మాణ సమయంలో స్థానభ్రంశం చెందిన తాగునీటి పైప్‌లైన్ విషయంపై వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ సునీల్‌తో క్యానం రాజ్యలక్ష్మి ఫోన్‌లో మాట్లాడారు. పైప్‌లైన్‌ను భూగర్భంలో ఏర్పాటు చేస్తే ఇంజినీరింగ్ శాఖ రహదారి పునరుద్ధరణ పనులను వేగంగా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని ఆమె సూచించారు. దీనిపై స్పందించిన జీఎం సునీల్, వారం రోజుల్లోపు పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి కావడానికి కృషి చేస్తున్నట్లు క్యానం రాజ్యలక్ష్మి తెలిపారు.

# ప్రమాద వేళ మానవత్వం చాటిన ఎస్సై భోజ్యా నాయక్

- పెరమన వద్ద జాతీయ రహదారిపై ఆటో బోల్తా
- తొమ్మిది మంది ప్రయాణికుల్లో ఇద్దరికి గాయాలు.. స్వయంగా సహాయక చర్యలు చేపట్టిన ఎస్సై





**సంగం, జూలై 18 (వార్తాప్రభ ప్రతినిధి)** సంగం మండలం పెరమన సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయగిరి వైపు నుంచి నెల్లూరుకు వెళ్తున్న ఓ ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు పెద్దలు ముగ్గురు చిన్నారులు కిందపడగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సంగం ఎస్సై భోజ్యా నాయక్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేశారు. గాయపడిన వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. అంతటితో ఆగకుండా మిగిలిన బాధితులు చిన్నారులను తన సొంత పోలీసు వాహనంలో సంగం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్‌సీ) తరలించారు. అక్కడ వైద్యులు వెంటనే పరీక్షించి అవసరమైన చికిత్స అందించేలా దగ్గరుండి పర్యవేక్షించారు.

**సేవాభావంతో ప్రశంసలు** ప్రమాదం జరిగిన సమయంలో ఎలాంటి ఆలస్యం చేయకుండా స్వయంగా రంగంలోకి దిగి బాధితులను సురక్షితంగా ఆసుపత్రులకు తరలించిన ఎస్సై భోజ్యా నాయక్ సేవాభావాన్ని స్థానికులు అభినందించారు. బాధితులకు ధైర్యం చెబుతూ అవసరమైన సహాయం అందించడంలో ఆయన చూపిన చొరవ పోలీసు శాఖపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంచిందని పలువురు పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కాంగ్రెస్ కార్యాలయంలో ఓటర్ల సవరణ ఫారమ్‌లపై కీలక సమీక్ష

- క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని డివిజన్ అధ్యక్షులకు పిలుపు
- సమావేశంలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి, పొన్నాడ సుబ్రహ్మణ్యం ప్రసాద్, ఏపీ మిథున్ రెడ్డి, నర్సారెడ్డి భూపతి రెడ్డి





**బాచుపల్లి, జూలై 18, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కీలక సమీక్షా సమావేశం నిర్వహించబడింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్, మేడ్చల్ పార్లమెంట్ కాంగ్రెస్ కనెక్ట్ ఇన్‌ఛార్జ్ పొన్నాడ సుబ్రహ్మణ్యం ప్రసాద్, మేడ్చల్--మల్కాజ్‌గిరి పార్లమెంట్ కో-ఆర్డినేటర్ మరియు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నియోజకవర్గంలోని వివిధ విభాగాల (డివిజన్ల) అధ్యక్షులతో కలిసి వారు ఎస్ఐఆర్ (ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) ఎన్యుమరేషన్ ఫారమ్‌లపై సుదీర్ఘంగా చర్చించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై విభాగాల అధ్యక్షులకు, పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి విభాగంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, ఓటరు జాబితాలోని తప్పులను సరిదిద్దేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పని చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఎన్నికల సంఘం జారీ చేసిన ప్రామాణిక నిర్వహణ విధానం (ఎస్ఓపీ) ప్రకారం ప్రతి బూత్ పరిధిలో ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, పరిశీలన మరియు ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. అనంతరం ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, పరిశీలన, ఓటర్లకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై నాయకులకు పలు సూచనలు చేశారు. ఓటరు సవరణ ప్రక్రియను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు పూర్తి సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కీలక సమావేశంలో మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ జిల్లా మత్స్యకార సహకార సంఘం చైర్మన్ మన్నే రాజు, డీసీసీ మహిళా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మితో పాటు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టీఐ ఏఎస్ సంస్థ సౌత్ జోన్ అధ్యక్షుడిగా ఏ. కృష్ణ యాదవ్ నియామకం



**తిరుపతి, జూలై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి):** సమాచార హక్కు చట్టం పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కృషి చేస్తున్న ఆర్టీఐ ఏఎస్ సంస్థ దక్షిణ భారత విభాగం (సౌత్ జోన్) అధ్యక్షుడిగా ఏ. కృష్ణ యాదవ్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని సంస్థ జాతీయ అధ్యక్షులు బండి పట్టాభి రెడ్డి అధికారిక ప్రకటనలో వెల్లడించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏ. కృష్ణ యాదవ్ మాట్లాడుతూ, దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాల్లో సంస్థను మరింత బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు తమ హక్కులను సమర్థవంతంగా వినియోగించుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన సదస్సులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను చైతన్యవంతులను చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రతి వర్గానికి ఆర్టీఐ చట్టం ప్రాముఖ్యతను తెలియజేస్తూ పారదర్శక పరిపాలనకు తమ వంతు సహకారం అందిస్తామని ఆయన అన్నారు. ఏ. కృష్ణ యాదవ్ నియామకంపై సంస్థ సభ్యులు, సామాజిక కార్యకర్తలు, ఆర్టీఐ ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో దక్షిణ భారతదేశంలో సంస్థ కార్యకలాపాలు మరింత విస్తరించి, సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో చైతన్యం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సంస్థ జాతీయ ఉపాధ్యక్షులు మోహన్ కుమార్, జాతీయ డైరెక్టర్ ఆవుల సుబ్రమణ్యం, బండి పరమేశ్వర రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు ఆవిలాల రఘు, జిల్లా అధ్యక్షులు మోహన్ మురళీతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం సంస్థ జాతీయ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె. జ్యోతి ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా నూతన సౌత్ జోన్ అధ్యక్షుడు ఏ. కృష్ణ యాదవ్‌కు సభ్యులు ఘనంగా అభినందనలు తెలియజేసి, ఆయన పదవీకాలంలో సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

# ఐ అండ్ పిఆర్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి.

**- అధ్యక్షులు కే జయ రావు వెల్లడి**



**విజయవాడ, జూలై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఐ అండ్ పి ఆర్ ఆంధ్ర ప్రదేశ్ శాఖ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి నూతనంగా ఏర్పాటయిన కమిటీ నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం అధ్యక్షులు కె. జయరావు పేర్కొన్నారు.. స్థానిక ఎన్.జి.ఓ కాలనీలోని సహకార భవన్ హాల్ లో శనివారం ఆంధ్రప్రదేశ్ ఐ అండ్ పిఆర్ రిటైర్డ్ ఉద్యోగుల నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన పత్రాలపై సంతకాలు పూర్తి చేసి, "ఐ అండ్ పిఆర్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ". పేరిట రిజిస్టర్ చేసేందుకు మీ సేవ కేంద్రంలో అందజేశారు. ఈ సందర్బంగా నూతన కార్యవర్గం అధ్యక్షులు కె. జయరావు మాట్లాడుతూ రిటైర్డ్ ఎ.పి ఐఅండ్ పిఆర్ ఉద్యోగుల సంఘం నూతన కార్యనిర్వహక కమిటీ ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషం గా ఉందని అన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ సి హెచ్ జాన్సన్ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి నూతన కమిటీ నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. పింఛనుదారుల సమస్యలకు సకాలంలో స్పందించి, పరిష్కారాలను సూచించే దిశగా పనిచేయాలన్నారు . రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ కె. రాజుబాబు మాట్లాడుతూ నూతన కార్యవర్గాన్ని అభినందించారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. జనరల్ సెక్రటరీ పి. వెంకట అప్పారావు, జాయింట్ సెక్రటరీ డి.వి. రమణ మూర్తి, టి. జయలక్ష్మి, కోశాధికారి ఎస్. శ్రీనివాస జీవన్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పెన్షన్ సమస్యలు, ఆరోగ్య భద్రత (హెల్త్ కార్డులు), మరియు ఇతర పెండింగ్ సమస్యల సాధన కోసం నూతన కమిటీ ఎల్లప్పుడూ ముందుంటుందని హామీ ఇచ్చారు.

**కార్యనిర్వాహక కమిటీ జాబితా** అధ్యక్షులుగా కె. జయ రావు, ఉపాధ్యక్షులుగా సిహెచ్. హరినాద్ బాబు, డి. నాగార్జున, జనరల్ సెక్రటరీగా పి. వెంకట అప్పారావు, జాయింట్ సెక్రటరీ డి.వి. రమణ మూర్తి, టి. జయలక్ష్మి, కోశాధికారి గా ఎస్. శ్రీనివాస జీవన్, కార్యనిర్వాహక సభ్యులుగా ఎల్. స్వర్ణలత, పి. గౌరీ శంకరం, జె. నాగభూషణం, డి.వి.ఎస్. రాజు లను ఎన్నుకొని సంఘం రిజిస్ట్రేషన్ ప్రక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ సమాచార శాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘం రిజిస్ట్రేషన్ సందర్భంగా శనివారం విజయవాడలో ' సహకార భూమి ' పత్రికా కార్యాలయంలో పత్రిక గౌరవ సంపాదకులు దాసరి కేశవులు శుభాకాంక్షలు తెలుపుతూ తొలి మినిట్స్ రిజిస్టర్ ను మన సంఘం ప్రెసిడెంట్ కే. జయరావు, జనరల్ సెక్రటరీ పి.వి. అప్పారావు కు బహుకరించారు. ఈ సమావేశంలో జి. గోవిందరాజులు, ఐ. కాశయ్య, జి. వెంకటేశ్వరావు, టి. జయలక్ష్మి, పి. గౌరీ శంకరం, జె. నాగభూషణం, తదితరులు హాజరైయారు.

## వెంకయ్య భౌతిక కాయానికి ఎమ్మెల్యే కృష్ణారావు నివాళి





**కూకట్ పల్లి, జూలై 18(వార్తా ప్రభ):** కె పి హెచ్ బి కాలనీ సీనియర్ నాయకుడు పి.వి. రమణ తండ్రి, పి. వెంకయ్య పరమపదించారు. శనివారం ఈ విషయం తెలియగానే కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బి ఆర్ యస్ పార్టీ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివా సరావు, పగడాల బాబూరావు వారి నివాసానికి చేరుకుని ఆయన పార్థివదేహానికి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరాడంబర జీవనం, మంచితనం, మానవత్వం, కుటుంబం పట్ల ఆయన చూపిన ప్రేమ ఎల్లప్పుడూ అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి అని అన్నారు.

**ప్రతి కార్యకర్తను జగనన్నతో అనుసంధానపరిచే**

## జగనన్న 2.0 సూపర్ యాప్

**మాజీ మంత్రి జోగి రమేష్**



**ఇబ్రహీంపట్నం, జులై 18(వార్తా ప్రభ ప్రతినిధి):** జగనన్న జగనన్న 2.0 సూపర్ యాప్ తో ప్రతి కార్యకర్త నేరుగా జగన్ తో అనుసంధానం అవ్వచ్చని తెలిపారు మాజీ మంత్రి మైలవరం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ జోగి రమేష్. శనివారం ఇబ్రహీంపట్నం వైసీపీ కార్యాలయంలో జగనన్న 2.ా యాప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరూ ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని కోరారు. ప్రజా సమస్యలు పై మరింత పోరాడటానికి డిజిటల్ వేదికిగా ఈ యాప్ పనిచేస్తుందని తెలిపారు. కూటమి కుట్రలు వలన అణిచివేతకు గురవుతున్న వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సైనికులకు జగనన్న ఇచ్చిన ఆయుధం అని, దేశంలోనే అత్యంత శక్తివంతమైన సోషల్ మీడియా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మీడియా అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్సిపి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధల మధ్య అన్నదానం - అన్నామ స్వరార్చన





**శేరిలింగంపల్లి, జూలై 18 (వార్తాప్రభ):** అన్నమయ్యపురంలో పద్మశ్రీ డాక్టర్ శోభారాజు ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదానం--అన్నమ స్వరార్చన కార్యక్రమం శనివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమంలో విష్ణు సహస్రనామ పారాయణం, లక్ష్మీ అష్టోత్తర శతనామావళి, అన్నమయ్య అష్టోత్తరంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం ప్రమోద్ తిప్పరాజు, రమ్య తిప్పరాజు దంపతులు అన్నమ స్వరార్చన సమర్పించగా, కుమారి సాయి చిన్మయి తిప్పరాజు నృత్యార్చనతో ఆకట్టుకున్నారు. సాయంత్రం శ్రీలత వాసుదేవన్ ఆధ్వర్యంలోని శిష్యులు విధిజ్ఞ, చిన్మయి, సాహితి అన్నమాచార్య సంకీర్తనలను మధురంగా ఆలపించి భక్తులను అలరించారు. మృదంగంపై కొళ్ళేగాల్ గణపతి రామ్, వయోలిన్‌పై శ్రీనివాసాచారి వాయిద్య సహకారం అందించారు. అనంతరం అన్నమాచార్య భావనా వాహిని మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ నందకుమార్ కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు. మంగళహారతి, ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసింది.

### డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ గా ఎం. బాల సరస్వతి



**అమలాపురం జూలై 18 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఈరోజు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పౌరసరఫరాల సంస్థ నూతన జిల్లా మేనేజర్ గా కుమారి ఎం. బాల సరస్వతి బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం మన్యం జిల్లా పౌర సరఫరాల సంస్థ లో పనిచేస్తూ జిల్లా మేనేజర్ గా పదోన్నతి పొంది కోనసీమ జిల్లాకు రావడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గారిని మరియు జాయింట్ కలెక్టర్ వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఇదే జిల్లాలో ఇన్చార్జి జిల్లా మేనేజర్ గా సమర్థవంతమైన సేవలందించి మళ్లీ రెగ్యులర్ హోదాలో జిల్లాకు రావడం జరిగింది.

# జిల్లా ఫస్ట్ వచ్చినా షైనింగ్ స్టార్ కాదు..!

● విధాన మార్పుతో ప్రభుత్వ స్కూల్ టాపర్లకు అన్యాయం.. 592 మార్కులతోనూ 20 వేల ప్రోత్సాహకం దక్కలేదు..

**గుడివాడ,జూలై 18 (వార్తాప్రభ) :** పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే "షైనింగ్ స్టార్స్" అవార్డుల విధానం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పెద్ద దెబ్బగా మారింది. ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలను కలిపి ర్యాంకులు ఇవ్వడం వల్ల జిల్లాలో ఫస్ట్ వచ్చినా రిక్తహస్తంతో మిగిలిపోతున్న పరిస్థితి నెలకొంది.

**592తో ఫస్ట్ అయినా లాభం లేదు..** కృష్ణా జిల్లాలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థి 592 మార్కులతో జిల్లా ప్రథమ స్థానం సాధించారు. కానీ అదే జిల్లాలో కార్పొరేట్ స్కూల్ విద్యార్థి 600/600 తెచ్చుకుంటే, ప్రభుత్వ స్కూల్ టాపర్‌కు షైనింగ్ స్టార్ అవార్డు దక్కడం లేదు. అదే విధంగా 591 మార్కులతో జిల్లా తృతీయ స్థానంలో నిలిచిన ప్రభుత్వ విద్యార్థి కూడా ఈ ప్రోత్సాహకానికి అనర్హుడయ్యారు.

**గుడివాడ నుంచి 9 మంది ఎంపిక కానీ..** గుడివాడ పట్టణ ప్రాంతం నుంచి మొత్తం 9 మంది షైనింగ్ స్టార్స్‌కు ఎంపికయ్యారు. వీరిలో ఎక్కువ మంది ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లకు చెందినవారే. వివరాలు : ఓసి 598 విశ్వ భారతి గౌతమ్ బిసిఏ 597 నారాయణ 596 విశ్వ భారతి బిసిబి 596 గౌతమ్ ఎస్టీ 591 విశ్వ భారతి ఎస్సీ గర్ల్స్ 594 విశ్వభారతి బిసిడి 468 గౌతమ్ సిడబ్ల్యుసి 461 విశ్వ భారతి సిడబ్ల్యుఎస్ఎన్ ఈ అవార్డులు మండలం వారీగా ఎంపిక చేస్తారు. కానీ ఎంపికైన వారందరూ గుడివాడ మండలానికి చెందినవారు కానవసరం లేదు. ఫలితంగా సొంత ఊళ్లో టాప్ చేసిన ప్రభుత్వ స్కూల్ విద్యార్థి, బయటి కార్పొరేట్ విద్యార్థి మార్కులతో పోల్చి వెనుకబడిపోతున్నాడు. గతంలో వేరు – ఇప్పుడు వేరు గత ప్రభుత్వ హయాంలో షైనింగ్ స్టార్స్ రు. 20 వేల ప్రోత్సాహకం కేవలం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే ఇచ్చేవారు. ప్రభుత్వం మారిన తర్వాత విధానం మారింది. ఇప్పుడు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులను కలిపి పోటీ పెట్టడంతో లక్షలు ఖర్చు చేసే కార్పొరేట్ విద్యార్థులతో పేద, మధ్యతరగతి ప్రభుత్వ స్కూల్ విద్యార్థులు పోటీపడలేకపోతున్నారు.

**ఎస్టీయు ఆగ్రహం.. "అర్బన్ ప్రభుత్వ విద్యార్థులకు తీవ్ర నష్టం"..** ఈ విధానంపై ఎస్‌టియు రాష్ట్ర సంఘం తీవ్రంగా స్పందించింది. "షైనింగ్ స్టార్స్ ఆర్థిక ప్రోత్సాహకాలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే ఇవ్వాలి. ప్రైవేట్ స్కూళ్లు ఎక్కువగా ఉండే అర్బన్ ప్రాంతాల్లో ప్రభుత్వ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు" అని ఎస్‌టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి డి. చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం పునరాలోచించాలి" జిల్లాలో ఫస్ట్ వచ్చినా అవార్డు రాకపోతే, ప్రభుత్వ స్కూళ్లలో చదివే పిల్లలను ప్రోత్సహించడం ఎలా? ప్రభుత్వం వెంటనే పునరాలోచించి షైనింగ్ స్టార్స్ అవార్డులు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే ఇచ్చేలా విధానం మార్చాలి" అని ఎస్‌టియు డిమాండ్ చేసింది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని చెప్పే ప్రభుత్వం, ప్రోత్సాహకాల విషయంలో మాత్రం ప్రభుత్వ విద్యార్థులనే నిరాశపరుస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

## ముళ్లపాడు జిల్లా పరిషత్ పాఠశాల కు 12 కుర్చీలు బహుకరణ




**పెనుగంచిప్రోలు,జూలై 18 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం లోని ముళ్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గ్రామ పెద్దలు నీటి సంఘం అధ్యక్షులు గుత్తా హనుమంతు రావు మరియు పగడాల రామకృష్ణ పి సి కమిటీ సభ్యులు గార్ల సహకారంతో గాదె రమేష్ జగ్గయ్యపేట వారి జ్ఞాపకార్థం వీరి కుమారులు గాదె శ్రీనివాసరావు మరియు గాదె సాయిరాం గార్ల సౌజన్యంతో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్ మరియు అంగన్వాడి సెంటర్లకు మొత్తం 12 కుర్చీలను బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వేల్పుల సుందర్ రావు , భూతరాజు లింగయ్య , పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ గ్రామంలోని దాతలుపాఠశాలల అభివృద్ధికి తోడ్పడటాన్ని కొనియాడుతూ వారికి ధన్యవాదములు తెలియజేసినారు.

## సబ్ జైలును తనిఖీ చేసిన న్యాయమూర్తి జి. వందన



**నందిగామ,జూలై 18 (వార్తాప్రభ) :** శనివారం మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా 16వ అదనపు న్యాయమూర్తి పి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నందిగామ సబ్ జైలును ఎడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. వందన సందర్శించారు. ఖైదీలతో నేరుగా మాట్లాడినారు జైలు పరిశుభ్రత, ఆహారం, తాగునీరు, వైద్య సౌకర్యాలను పరిశీలించినారు ఖైదీలకు వారి చట్టబద్ధ హక్కుల గురించి వివరించినారు జైలు లీగల్ ఎయిడ్ న్యాయవాది షేక్. ఆజాద్ సబ్ జైల్ సూపర్నెంట్ సిహెచ్ .సీతారామయ్య పి.ఎల్.వి. జై. రవి, ఎం ఎల్ ఎస్ సి స్టాఫ్ గంగా జ్యోతి పాల్గొన్నారు.

## యదార్ధ హృదయంతో ఆర్థిక సహాయం చేయాలి

కలెక్టరు కీర్తి చేకూరికి క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వినతి



**రాజమహేంద్రవరం,జూలై 18 (వార్తాప్రభ) :** ప్రమాదవశాత్తు గోదావరి నీటిలో పడి మృతి చెందిన పెద్దపాటి హేమంత్ (20), జశ్వంత్ ల కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మోసా అబ్రహాం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరిని ఆమె చాంబర్లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధవళేశ్వరం క్వారీ రోడ్డులో నివాసం ఉంటున్న పాస్టర్ పెద్దపాటి శేషు కుమార్, శాంతి అమృత వల్లి దంపతుల కుమారులు ధవళేశ్వరం బ్యారేజి గోదావరి నది దగ్గర ఆడుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు గోదావరిలో పడి మునిగి మృతి చెందడం జరిగిందనీ తెలిపారు. అంతంత మాత్రంగానే జీవనం సాగిస్తున్న పాస్టర్ శేషు కుమార్ కుటుంబ అందొచ్చిన పిల్లలు అకాలంగా మృతి చెందడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాయని, దీనివలన వారి పోషణ కూడా కష్టంగా మారిందని దయార్ధ హృదయంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని అబ్రహాం కోరారు. గత ఏడాది కాకినాడ కు చెందిన ఎనిమిది మంది యువకులు ఇదే మాదిరిగా నీట మునిగి చనిపోతే ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసిందని, అదే విధంగా పెద్దపాటి శేషు కుమార్ కుటుంబానికి కూడా సహాయం చేసి ఆదుకోవాలని క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరుపున కలెక్టరును కోరారు.

## గుడివాడలో ముస్లిం షాదీ ఖానా మంజూరు చేసిన సీఎం చంద్రబాబుకి.. ముజాహిద్ కృతజ్ఞతలు



**గుడివాడ,జూలై 18 (వార్తాప్రభ) :** ముస్లిం సమాజం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ముస్లిం షాదీ ఖానా నిర్మాణానికి సీఎం చంద్రబాబు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడం పట్ల ముస్లిం సమాజం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తోంది టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ముజాహిద్ అన్నారు. ముస్లిం కుటుంబాల వివాహాలు, సామాజిక కార్యక్రమాలు, మతపరమైన సమావేశాలు మరియు ఇతర కమ్యూనిటీ కార్యక్రమాల నిర్వహణకు అనువైన వసతులు కల్పించే ఈ షాదీ ఖానా నిర్మాణం గుడివాడ ముస్లిం సమాజానికి ఒక చిరకాల స్వప్న సాకారంగా నిలవనుంది. ఈ నిర్ణయం మైనారిటీల సంక్షేమం, సామాజిక న్యాయం మరియు సమగ్ర అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది. ఈ సందర్భంగా గుడివాడ ముస్లిం పెద్దలు, మత గురువులు, మేధావులు, యువత మరియు మహిళల తరుపున ముఖ్యమంత్రి కి, ఎమ్మెల్యే కి షేక్ ముజాహిద్ తమ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, షాదీ ఖానా నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభమై పూర్తికావాలని ఆకాంక్షించారు.

## ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి కళ్యాణం

**అమలాపురం,జూలై 18 (వార్తాప్రభ) :** ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అమలాపురం వారి ఆధ్వర్యంలో దాతల సహకారంతో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవము స్థానిక యెశీదూరి కన్వెన్షన్ హాల్ నందు శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి భజన మండలి దేవరపల్లి మండలం యర్నగూడెం వారిచే శనివారం సాయంత్రం అత్యంత వైభవంగా నిర్వహించారు యర్రమిల్లి విశ్వేశ్వరరావు అన్నపూర్ణ యెశీదూరి నాగేశ్వరరావు రాఘవ దంపతులు కళ్యాణ క్రతువులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు పుణ్యాహవచనం, విశ్వక్సేన ఆరాధన, సంకల్పము, మంగళాష్టకము, వేదమంత్రాలు, కన్యాదానం, మాంగల్య ధారణ, తలంబ్రాలు, హారతి వంటి కార్యక్రమాలు కన్నుల పండుగగా భజన మండలి ఆర్గనైజర్ బొల్లిన పద్మజా వారి బృందం నిర్వహించడంతోపాటు భక్తి గీతాలను ఆలపించి భక్తులను భక్తి పారవశ్యంలో ముంచారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం తో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని



పెరుమాళ్ ని సేవించుకొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు, ముఖ్య సలహాదారు నంబూరి విశ్వనాథం, కార్యదర్శి నూలు సూరిబాబు, కోశాధికారి శ్రీకాకోలపు రాంపండు, కోఆర్డినేటర్ నంబూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొని వారి వారి సేవలను అందించారు.

## జన్మభూమి--మన ఊరు కార్యక్రమంతో గ్రామాల అభివృద్ధి

● ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలే ప్రభుత్వ లక్ష్యం ● హనుమంతుపాలెంలో డొంక రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,జూలై 18 (వార్తాప్రభ) :** పట్టణ పరిధిలోని హనుమంతు–పాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన "జన్మభూమి--మన ఊరు" కార్యక్రమంలో భాగంగా హనుమంతుపాలెం మెయిన్ రోడ్డు నుండి ఎన్ఎస్‌పీ కాలువ వరకు వెళ్లే డొంక రహదారికి ఇరువైపులా ఉన్న కంప చెట్ల తొలగింపు, మరమ్మత్తుల పనులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులు, కూటమి నాయకులతో కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రజలు నిత్యం ఉపయోగించే రహదారులను సురక్షితంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. "జన్మభూమి--మన ఊరు" కార్యక్రమం ద్వారా గ్రామాల సమస్యలను నేరుగా గుర్తించి, శాశ్వత పరిష్కారాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలనకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్,సంబంధిత శాఖల అధికారులు, రైతులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ దేవస్థానం నూతన అభివృద్ధి కమిటీ చైర్మన్ గా మెకానిక్ రావు...



**కృత్తివెన్ను,జూలై 18 (వార్తాప్రభ) :** బంటుమిల్లి లోని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం నికి నూతన అభివృద్ధి కమిటీ చైర్మన్ గా బంటుమిల్లి మరియు పరిసర ప్రాంతాలకు సుపరిచితుడైన బంటుమిల్లి గ్రామానికి చెందిన గోపిశెట్టి ధనుంజయ రావు ( మెకానిక్ రావు)ను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కనకదుర్గమ్మ దేవస్థానం ఆలయ అభివృద్ధి, వచ్చే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పనే లక్ష్యంగా ఆయన భక్తులకు సేవలు అందిస్తారని కమిటీ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ధనుంజయ రావు మాట్లాడుతూ కమిటీ సభ్యులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ దుర్గమ్మ తల్లి దేవస్థానం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, దేవస్థానం అభివృద్ధి కోరి భక్తులు ఇచ్చిన సలహాలను సూచనలను పరిగణలోకి తీసుకుని ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా పారదర్శకంగా ఇచ్చిన బాధ్యతలను నిర్వహిస్తానని నూతన చైర్మన్ గా ఎంపికైన ధనుంజయ్ రావు తెలిపారు. ధనుంజయ్ రావు నియామకం పట్ల పుర ప్రముఖులు, రాజకీయ ప్రముఖులు సహచర మెకానిక్ మిత్రులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు...

## పదోన్నతి పొంది బదిలీపై వెళుతున్న సుధా ప్రవీణ్ కు జనసేన నేతల సత్కారం



**కోడూరు, జూలై 18 (వార్తాప్రభ) :** కోడూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తూ గత కొద్దిరోజుల కిందట డిడిఎల్ఓ గా పదోన్నతి పొంది తిరువూరు డిడిఎల్ఓ గా బదిలీపై వెళుతున్న సుధా ప్రవీణ్ ను కోడూరు మండల జనసేన పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. స్థానిక కార్యాలయంలో సుధా ప్రవీణ్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువా కప్పి ఘనంగా సత్కరించి, స్వీట్స్ అందించి అభినందనలు తెలియజేశారు. సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మరే గంగయ్య మాట్లాడుతూ కోడూరు మండలంలో గత ఆరు సంవత్సరాలుగా సేవలందిస్తూ ప్రజల యొక్క మనలను పొందారని, ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుని వెళ్లడంలో సుధా ప్రవీణ్ కృషి చేశారని ఆయన అన్నారు. వృత్తి పట్ల నిబద్ధత పనిచేస్తూ సౌమ్యుడుగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత,కోడూరు పట్టణ అధ్యక్షులు కోట రాంబాబు, వర్రే రాంబాబు, కాగిత రామారావు, అప్పి కట్ల వినోద్ తదితరులు పాల్గొన్నారు

## "స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర" కూటమి ప్రభుత్వ లక్ష్యం - విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**నందిగామ,జూలై 18 (వార్తాప్రభ) :** ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి హరితాంధ్ర నిర్మాణంలో భాగస్వాములు కావాలనీ ప్రభుత్వ విప్ స్థానిక శాసనసభ్యులు తంగిరాల సౌమ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక 7వ వార్డు కొత్త బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులు, కూటమి నాయకులతో కలిసి బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో నింపాలనే లక్ష్యంతో స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించి హరిత విప్లవంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెరగడం వల్ల కాలుష్యం తగ్గడంతో పాటు భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు ప్రజలు, యువత, స్వచ్ఛంద సంస్థలు,



ప్రజాప్రతినిధులు సమష్టిగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్ అవార్డులకు చల్లపల్లి విజయ జూనియర్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపిక..




**చల్లపల్లి/అవనిగడ్డ,జూలై 18 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యాప్తికి చేస్తున్న కృషిలో భాగంగా 2025-2026 విద్యాసంవత్సరానికి ప్రకటించిన షైనింగ్ స్టార్స్ అవార్డులకు విజయ జూనియర్ కళాశాలకు చెందిన నలుగురు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపీసీ గ్రూపులో 1000 కి 988 మార్కులు సాధించిన బుస్సా భార్గవి, సైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయింది. సీఈసీ గ్రూపు నుండి 1000 కి 972 మార్కులు సాధించిన మల్లవోలు ప్రజ్ఞ , సీఈసీ గ్రూపు నుండి 1000 కి 959మార్కులు సాధించిన బళ్ళారపు హాసిని సీఈసీ గ్రూపు నుండి 1000 కి 870 మార్కులు సాధించిన మాగంటి మోజేష్ లు షైనింగ్ స్టార్ అవార్డులను సోమవారం మచిలీపట్నంలో కలెక్టర్ బాలాజీ గారి చేతుల మీదుగా అందుకోవటం జరుగుతుందని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్ తెలియజేశారు సైనింగ్ స్టార్స్ అవార్డులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ షేక్ అబ్దుల్ రహీం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పెమ్మసాని రమేష్ బాబు , అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు

## కనక దుర్గమ్మా తల్లికి ఆషాడం సారె సమర్పించిన భక్తులు...



**కృత్తివెన్ను,జూలై 18 (వార్తాప్రభ) :** మండల కేంద్రం బంటుమిల్లి టౌన్ లోని అమ్మలు గన్న అమ్మా, ముగ్గురు అమ్మల మూల పూటమ్మ, చాల పెద్దమ్మ, జగజ్జనని జగన్మాత లోకమాత శ్రీ కనక దుర్గా భవాని మాతకు బంటుమిల్లి టౌన్ ఆర్యవైశ్య మహిళలు భక్తులు కలిసి 101 జల బిందెలతో కనక డప్పులతో ఊరేగింపుగా బందర్ రోడ్ లోని వినాయక స్వామి దేవాలయం నుంచి బంటుమిల్లి కనక దుర్గా నగర్ లో కొలువై ఉన్న దుర్గమ్మా తల్లి దేవస్థానానికి నడుస్తూ వచ్చి పిలిస్తే పలికే ఆ బంగారు తల్లి భవాని మాతకు ఆషాడం సారె అత్యంత భక్తి శ్రద్దలతో సమర్పించారు. చల్లని తల్లి చల్లని చూపుతో ప్రపంచం మెంత్తం ప్రశాంతత తో ఉండాలని ఆ మహాశక్తి నీ మనస్ఫూర్తిగా ప్రార్దించారు. ప్రకృతి స్వరూపిణి అయిన ఆ తల్లి అపారమైన కరుణా, కటాక్షలతో ప్రస్తుతం దేశాన్ని వణికిస్తున్న సూపర్ ఎల్ నీనో సమస్య తొలగిపోయి, దండిగా వర్షాలు పడి రైతులు మోకాలలో మళ్ళీ చిరునవ్వులు చిగురించాలని పొలాలు అన్ని ఆ పరమేశ్వరి దయతో పచ్చగా పండి దేశం సుబిక్షం కావాలని భక్తులు ఓంకార స్వరూపం అయిన అతల్లిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు అందరికి అమ్మవారి ఆశీస్సులు మెండుగా అందుతాయని ఆలయ ధర్మకర్త గరికపాటి కూనరావు అన్నారు. ఈ సందర్భంగా గరికపాటి కూనరావు మల్లేశ్వరం ఏ ఏం సి డైరెక్టర్ వక్కలగడ్డ కరుణా కుమార్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొల్లా లలితా శేఖర్ ఊర నాగమణి తదితరులు పాల్గొన్నారు.......




స్థానిక గుడివాడ లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన "స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమములో పాల్గొన్నారు. విద్యార్థుల ఉత్సాహాన్ని చూసి తెలుగుదేశం కార్యకర్తలు ప్రత్యేక అభినందనలు తెలియ చేసినారు. కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. రవీంద్ర బాబు హర్షం వ్యక్తం చేసినారు. ఈ కార్యక్రమము లో ఎన్ఎస్ఎస్ పి.ఓ సతీష్ చంద్ర మరియు అధ్యాపకులు రాము, శ్రీనివాసు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

–గుడివాడ,జూలై 18 (వార్తాప్రభ) :

## బంటుమిల్లిలో డెంగ్యూ నివారణ మాసోత్సవం ర్యాలీ...



**కృత్తివెన్ను,జూలై 18 (వార్తాప్రభ) :** డెంగ్యూ నివారణ మాసోత్సవం సందర్భంగా బంటుమిల్లి న్యూ హరిజన వాడ వద్ద ర్యాలీ జరిగింది. డాక్టర్ వి కె పవన్ కుమార్ హెచ్ ఇ ఓ శ్రీనివాస్ హెచ్ ఎస్ భగవాన్లు హెచ్ ఏ ప్రసాద్ హెచ్ ఏ సుజన ఆశ కార్యకర్తలు పి హెచ్ సి ఫీల్డ్ స్టాఫ్ పాల్గొన్నారు డాక్టర్ వి కె పవన్ కుమార్ దోమలు కుట్టకుండా, పుట్టకుండా ప్రతి ఒక్కరూ చూడాలి అన్నారు ఇంట్లో,ఆవరణలో దోమలు పెరగకుండా (కూలర్స్ఎప్పటి కప్పుడు నీళ్లు మార్చాలి) కొబ్బరి చిప్పలు, రోళ్లు, టైర్లు పాత పాత్రలు ఎక్కడా నీటు నిలవకుండా చూసుకోవాలి అని దోమతెరలు, మస్కిటో మాట్స్ లిక్విడ్స్ వాడటం ద్వారా దోమలు కుట్టకుండా మురుగు నీరు కానీ మంచినీళ్లు కానీ నిల్వ ఉన్నప్పుడు దోమల లార్వా లకు నిలయం కాకుండా చుడాలి అని తెలిపారు...

# 'ప్రజాదర్బారు' సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు

● నిర్దిష్ట గడువులోగా సమస్యలు పరిష్కరించాలి ● మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు




**జి.కొండూరు,జూలై 18 (వార్తాప్రభ) :** ప్రజాదర్బారు సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదని,నిర్దిష్ట గడువులోగా సమస్యలు పరిష్కరించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు అధికారులను ఆదేశించారు.జి.కొండూరు గ్రామంలోని మండల ప్రజా పరిషత్ కమ్యూనిటీ హాల్లో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'ప్రజాదర్బారు' కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.వివిధ సమస్యలపై ప్రజలు తమ అర్జీలు ఎమ్మెల్యే కి అందజేశారు.ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ,రైస్ కార్డులు, ఉపాధి, పెన్షన్లు, దివ్యాంగుల ధ్రువపత్రాలు, తాగునీటి పైప్‌లైన్లు, భూ సమస్యలు, రహదారుల అభివృద్ధి, రెవెన్యూ మరియు పోలీసు సేవలకు సంబంధించిన అనేక అర్జీలు అందినట్లు ఎమ్మెల్యే తెలిపారు.ప్రజాదర్బార్ వేదికపై అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (PGRS) ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసి జవాబుదారీతనంతో పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు.ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, అధికారులు బాధ్యతా యుతంగా వ్యవహరించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి శ్రీనివాసరావు, తాహశీల్దార్ రిబ్కా రాణి, డిప్యూటీ తహశీల్దార్ ఎం.విజయ్ కుమార్,డిప్యూటీ ఎంపీడీవో కృప కుమార్ ఐడీసీ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని,టీడీపీ మండల పార్టీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు వేములకొండ వెంకటేశ్వరరావు, లంక నాగేశ్వరరావు,ఏ ఎం సీ మాజీ ఛైర్మన్ ఉయ్యూరు వెంకట నరసింహారావు,జి.కొండూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు పజ్జూరు విజయ్, భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు,జనసేన పార్టీ మండల అధ్యక్షులు యర్రబోలు నరసింహారావు, గ్రామ పార్టీ మాజీ అధ్యక్షులు పజ్జూరు వెంకటేశ్వ రరావు (బుల్లి),వివిధ గ్రామాల సోసైటీ ఛైర్మన్ లు, జి.కొండూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏటుకూరి బసవ లింగేశ్వరరావు,వివిధ శాఖ అధికారులు,వివిధ గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముద్రగడకు ఘన నివాళులర్పించిన రాజకీయ నేతలు




**కిర్లంపూడి,జూలై 18 (వార్తాప్రభ) :** కాపు ఉద్యమ నేత,స్వర్గీయ ముద్రగడ నివాసానికి చేరుకున్న పలువురు నేతలు ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ముద్రగడ సమాధి వద్దకు చేరుకుని శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ముద్రగడ కుటుంబ సభ్యులు ముద్రగడ బాలు,గిరిబాబులకు ధైర్యం చెప్పారు.ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన ముద్రగడ పద్మనాభం సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.రాజకీయ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ముద్రగడ పద్మనాభం ప్రజల మనసుల్లో నిలిచిపోతారని అన్నారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప,ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ, కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు,ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, ఏపీఐఐసీ మాజీ ఛైర్మన్ శ్రీకాకుళపు శివరామ సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి,పెండెం దొరబాబు పర్వత బాపనమ్మ, పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, వరుపుల సుబ్బారావు, జ్యోతుల చంటిబాబు, ఎస్ వి ఎస్ అప్పలరాజు.వర్మ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ,రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మూదినారాయణ స్వామి,నియోజకవర్గ సిబిఎన్ ఆర్మీ కో–ఆర్డినేటర్ యాళ్ల జగదీష్,ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, పర్వత రాజబాబు,పర్వత జానకి దేవి,ఏలేశ్వరం పట్టణ నాయకులు బొదిరెడ్డి గోపి,నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్,ప్రత్తిపాడు సి హె చ్ సి వర్కింగ్ కమిటీ ఛైర్మన్,వైస్ ఛైర్మన్లు వెలుగుల నాని,బొల్లు వెంకటేశ్వరరావు ,ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సుంకర సోమరాజు,ఉత్తరకంచి మాజీ సర్పంచ్ మంతెన వెంకటరమణ, సుబ్బారెడ్డి సాగర్ ఛైర్మన్ ఇళ్ల అప్పారావు,మండల మాజీ ప్రతిపక్ష నేత మిరియాల శ్రీను,నాయకులు బద్ది రామారావు,బొల్లు కొండబాబు, రుచి రమేష్,బుద్ధ ఈశ్వరరావు,చక్కపల్లి నవీన్,వాల్టన్,యిటంశెట్టి భాస్కర్ బాబు తదితరులు ముద్రగడకు నివాళులర్పించారు.

# స్వచ్ఛ రథంపై కీర్తి పతాకం!

● ఇబ్రహీంపట్నం మండలానికి ఉత్తమ స్వచ్ఛ రథంలో రాష్ట్ర స్థాయి గుర్తింపు

● స్వచ్ఛ రథం ఆపరేటర్ ఇ.కోటయ్యకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అభినందనలు



**విజయవాడ,జూలై 18 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ రథాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కోటి కిలోల పొడి వ్యర్థాల సేకరణ చారిత్రాత్మక మైలురాయిని చేరుకున్న సందర్భంగా 28 జిల్లాల నుంచి ఉత్తమంగా పనిచేసిన స్వచ్ఛ రథం ఆపరేటర్లను ఇటీవల గుర్తించింది. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన స్వచ్ఛ రథం ఆపరేటర్ ఇ. కోటయ్య రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన స్వచ్ఛ రథం ఆపరేటర్‌గా ఎంపికయ్యారు. ఇటీవల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ వీఆర్ కృష్ణతేజ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు. ఆయనకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటి నుంచి పొడి వ్యర్థాలను క్రమబద్ధంగా సేకరించడం, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణలో ఆపరేటర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంలో స్వచ్ఛ రథాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో గౌరవ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో నిబద్ధతతో పనిచేస్తున్న అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజలందరికీ అభినందనలు తెలిపారు. ప్రత్యేకించి ఇబ్రహీంపట్నం మండల స్వచ్ఛ రథం ఆపరేటర్ కోటయ్య అంకితభావంతో పనిచేసి రాష్ట్ర స్థాయిలో ఈ గుర్తింపు సాధించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు మరింత సమర్థవంతంగా ఘన వ్యర్థాల నిర్వహణ చేపట్టి, స్వచ్ఛత పరిరక్షణలో ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

# రైతుల పక్షాన నిలిచిన పొన్నం బాలాజీ సేవ అభినందనీయం - ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



**పెనుగంచిప్రోలు,జూలై 18 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం లోని గుమ్మడిదూరు పంచాయతీ లోని వెల్దుర్తిపాడు గ్రామం నుంచి నందిగామ మండలం, కొండూరు వెళ్లే డొంక రోడ్డును జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య సోమవారం పరిశీలించారు. భారీ వరదలకు రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు పొలాలకు వెళ్లడంలో, పంట రవాణాలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న పోలంపల్లి డ్యాం ఛైర్మన్ పొన్నం బాలాజీ వెంటనే స్పందించారు. ప్రభుత్వ సహాయం కోసం వేచి చూడకుండా తన సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు చేయించి రైతులకు రాకపోకల మార్గాన్ని అందుబాటులోకి తెచ్చారు.పూర్తయిన పనులను పరిశీలించేందుకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పోలంపల్లి డ్యాం ఛైర్మన్ పొన్నం బాలాజీ తో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పొన్నం బాలాజీ రైతుల పట్ల చూపిస్తున్న ప్రేమ, చొరవ నిజంగా అభినందనీయం. పోలంపల్లి డ్యాం విషయంలో కానీ, కాలువల పూడికతీతలో కానీ, ఇప్పుడు ఈ డొంక రోడ్డు మరమ్మతుల్లో కానీ ఎప్పుడూ ముందుండి రైతుల పక్షాన నిలబడుతున్నారు. పదవి కోసం కాకుండా సేవ కోసం పనిచేసే బాలాజీ లాంటి నాయకులు మన నియోజకవర్గానికి గర్వకారణం అన్ని కొనియాడారు.రైతుల సమస్యలను సొంత బాధ్యతగా తీసుకుని పరిష్కరించిన బాలాజీ సేవను స్థానికులు, రైతులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి సన్నిధిలో వరుణ హోమం..



**మోపిదేవి,అవనిగడ్డ,జూలై 18 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా, మోపిదేవిలో వేంచేసియున్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం లోక కళ్యాణార్థం, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు సస్యశ్యామలంగా వర్ధిల్లాలనే సంకల్పంతో వరుణ మంత్ర జపం , వరుణ హోమం కార్యక్రమాలను వైదిక పండితుల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వైదిక పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య వరుణ దేవునికి ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించి, రాష్ట్రంతో పాటు దేశమంతటా సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు కలగాలని సంకల్పించారు. ఈ కార్యక్రమం ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు నేతృత్వంలో నిర్వహించిన వైదిక కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# యోగాంధ్రకు ఘన గౌరవం..

● విద్యార్థులు, అధ్యాపకులు, వివిధ సంస్థల ప్రతినిధులు, అధికారులకు ప్రశంసా పత్రాలు

● యోగంతో ఆరోగ్యం -- భాగస్వామ్యంతో విజయం.. ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ,జూలై 18 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర--2026 రాష్ట్ర కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లాలో విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా, యోగాంధ్రలో విశేషంగా పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ.. యువతకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా నుంచి 15,300 మంది విద్యార్థులు, యువత, యోగా సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు యోగాంధ్ర కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని పేర్కొన్నారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, ఫార్మసీ, ఆయుష్, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, యోగా సంస్థలు, ఎన్‌జీఓల సమష్టి సహకారంతో ఈ విజయం సాధ్యమైందన్నారు. యోగం శారీరక, మానసిక ఆరోగ్యానికి మూలాధారమని, ప్రతి ఒక్కరూ యోగాన్ని నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. యోగాంధ్ర విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, ఆర్‌డీవో వెన్నెల శ్రీను, యువజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి డా. కొల్లేటి రమేష్, జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్నప్రియదర్శిని, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కోటేశ్వరరావు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, యోగా సంఘాల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వినూత్న ఆలోచనలతో విజయవంతమైన వ్యాపారాలు

● ఆర్‌టీఐహెచ్‌లో స్టార్టప్‌లు, ఐపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన ● యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఆర్‌టీఐహెచ్ విస్తృత సహకారం ● ఆర్‌టీఐహెచ్ విజయవాడ సీఈవో డా. హరిబాబు




**విజయవాడ, జూలై 18 (వార్తాప్రభ) :** యువతలోని వినూత్న ఆలోచనలను విజయవంతమైన వ్యాపారాలుగా తీర్చిదిద్దేందుకు ఆర్టీఐహెచ్ అనేక కార్యక్రమాల ద్వారా విస్తృత సహకారం అందిస్తోందని ఆర్టీఐహెచ్ విజయవాడ సీఈవో డా. హరిబాబు అన్నారు. విజయవాడలోని ఎనికేపాడులో ఉన్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) కార్యాలయంలో శనివారం స్టార్టప్‌లు, మేధో సంపత్తి హక్కుల (ఐపీఆర్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెస్టిన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు చెందిన 80 మంది బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని కొత్త ఆవిష్కరణలు, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఉన్న అవకాశాలపై అవగాహన పెంపొందించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీఐహెచ్ విజయవాడ సీఈవో డా. హరిబాబు మాట్లాడుతూ స్టార్టప్‌ల స్థాపన నుంచి వ్యాపార విస్తరణ వరకు అవసరమైన మార్గదర్శకత్వంతో పాటు నిపుణుల సలహాలు వంటి సేవలను అందిస్తున్నామని వీటిని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐపీఆర్ అటార్నీ సుధీర్.. ట్రేడ్‌మార్క్, బ్రాండింగ్, జీఎస్టీ, మేధోసంపత్తి హక్కుల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఒక వినూత్న ఆలోచనను చట్టబద్ధంగా ఎలా రక్షించుకోవాలి, బ్రాండ్ విలువను ఎలా పెంచుకోవాలి, మేధో సంపత్తిని వ్యాపార విజయానికి ఎలా ఉపయోగించుకోవాలనే అంశాలను ఉదాహరణలతో సహా వివరించారు. కార్యక్రమం అనంతరం సుమారు పది మంది విద్యార్థులు ఆర్టీఐహెచ్ స్పార్క్ కార్యక్రమంలో చేరేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. వీరికి ఆర్టీఐహెచ్ ద్వారా ప్రత్యేక మెంటారింగ్, హ్యాండ్‌హోల్డింగ్, స్టార్టప్ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# హెచ్.ముత్యాలంపాడులో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

## "వార్తాప్రభ" కథనానికి స్పందన




వార్తాప్రభ శుక్రవారం 17 జూలై 2026

హెచ్. ముత్యాలంపాడు ఎస్సీ కాలనీలో

పడకేసిన పారిశుధ్యం

● కాలనీవాసులను పట్టిపీడిస్తున్న డ్రైనేజీ సమస్య

● డ్రైనేజీ సమస్య కు శాశ్వతంగా పరిష్కారం చూపించాలంటున్న కాలనీ వాసులు

**జి.కొండూరు,జూలై 18 (వార్తాప్రభ) :** మండలంలోని హెచ్.ముత్యాలం పాడులో ఆ గ్రామ పంచాయితీ కార్యదర్శి ఎస్. తిరుపతిరావు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.ఈ నెల 17వ తేదీ శుక్రవారం వార్తా ప్రభ దినపత్రికలో ప్రచురించిన "హెచ్. ముత్యాలంపాడు ఎస్సీ కాలనీలో పడకేసిన పారిశుధ్యం" కథనానికి పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులు ముమ్మారం చేశారు. ముఖ్యంగా గ్రామంలో డ్రైనేజీలలో చెత్తను తొలగిస్తున్నారు.రోడ్లపై చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పారిశుధ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.కార్యదర్శి తిరుపతి రావు దగ్గరుండి పారిశుధ్య పనులను పర్యవేక్షిం చారు.గ్రామంలో పోచిగొల్ల రత్తయ్య ఇంటి దగ్గర నుంచి సుమారు 8 మీటర్ల మేర డ్రెయిన్ లో పూడిక తొలగించారు.గోరే మధు ఇంటి దగ్గర నుంచి 10 మీటర్ల పొడవున డ్రెయిన్ లో పూడిక తొలగించడం జరిగింది. ప్రత్తిపాటి అబ్రమ్ ఇంటి వద్ద నుంచి 8మీ డ్రెయిన్, డీసిల్టింగ్ పూర్తయింది. చిలపరపు రవికుమార్ ఇంటి దగ్గర నుంచి 10 మీటర్ల డ్రెయిన్ లో పూడిక తొలగించారు. చిలపరపు నానారావు ఇంటి దగ్గర నుంచి 6 మీటర్ల డ్రెయిన్ లో పూడిక తొలగించారు. మురుగునీటి కాలువల భాగంలోని పూడికను తొలగించి, గృహాల నుంచి సేకరించిన గ్రే వాటర్ ప్రవాహానికి అనువుగా మల్చారు.



Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188